ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 4
సంచిక : 46

సోమవారం 25 ఆగస్టు 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## పుజారా వీడ్కోలు



07




### అంతరిక్షంలోకి వెళ్తాననుకోలేదు

చిన్నప్పుడు చాలా బిడియస్థుడిని: శుభాన్ష్ శుక్లా

గగన్‌యాన్ యాత్రికులకు రాజ్‌నాథ్ సన్మానం

.. వివరాలు 4లో



### అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పరీక్ష సక్సెస్

డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన ఐఏడీడబ్ల్యూఎస్

.. వివరాలు 4లో



### వినియోగదారుల ఫోరమ్‌ల అధికారాల పునరుద్ధరణ

అన్ని రకాల ఆదేశాలను అమలు చేసేలా సుప్రీంకోర్టు తీర్పు

.. వివరాలు 4లో



# మన మేధావులు మన కోసం!

## సొంత మనుషులకు సాయపడేలా వాడుకోవాలి



పరిశోధనలకు అవసరమైన చారిత్రక డాటా అందిస్తాం

విద్యాసంస్థలతో పరిశోధకులను అనుసంధానం చేస్తాం

రాష్ట్రం నుంచి ఆవిష్కరణలకు ఇది సరైన సమయం

ఆసియా-పసిఫిక్ బయో డిజైన్ సదస్సులో రేవంత్

**హైదరాబాద్ :** "మన మేధావులు ఎన్నో ఏళ్లుగా ఇతర దేశాల సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇప్పుడు మన సొంత మనుషులకు సహాయపడేలా మన మేధస్సును వినియోగించాల్సిన సమయం ఆసన్నమైంది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వారికి అవసరమైన పూర్తి మద్దతును తమ ప్రభుత్వం అందిస్తుందన్నారు. డాటా గోప్యత చట్టాలకు లోబడి పరిశోధనలకు అవసరమైన చారిత్రక డాటాను కూడా పంచుకుంటామని

మిగతా 2 లో

### వ్యవస్థల్ని నియంత్రిస్తే ఊరుకోం

అందరూ చట్టపరిధిలో పని చేయాల్సిందే

సినీ నిర్మాతలు, దర్శకులతో సీఎం రేవంత్‌రెడ్డి

అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన తెలుగు సినిమా

ఇలాంటి పరిస్థితుల్లో వివాదాలు ఉండకూడదు

త్వరలో సినీ కార్మికులను పిలిచి మాట్లాడతా

స్కిల్ యూనివర్సిటీలో సినీ పరిశ్రమకు అవసరమైన ఏర్పాట్లు చేస్తాం: సీఎం రేవంత్

## సురవరానికి తుది వీడ్కోలు

ప్రజల సందర్శనార్థం సీపీఐ ఆఫీసులో భౌతిక కాయం

రేవంత్, చంద్రబాబు, వెంకయ్య సహా ప్రముఖుల నివాళి

అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర

గాంధీ వైద్య కళాశాలకు భౌతిక కాయం అప్పగింత

సురవరం పేరు నిలిచిపోయేలా చేస్తాం: సీఎం రేవంత్

సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు: ఏపీ సీఎం చంద్రబాబు



**హైదరాబాద్ :** సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వం అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలికింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి నుంచి ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు ఆయన భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. అక్కడ ప్రజలు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా

మిగతా 2 లో



04

## ప్రజాస్వామ్య చోదక శక్తి పార్లమెంటు

చట్ట సభలు ప్రతిష్టను కోల్పోయినప్పుడల్లా విపరిణామాలు

అక్కడ రూపుదిద్దుకునే సరైన విధానాలే దేశాన్ని సన్మార్గంలో నడిపిస్తాయి : స్పీకర్ల సమావేశంలో అమిత్ షా



## బిహార్‌లో ఓట్ల చోరీని అడ్డుకుంటాం

### ఎస్ఐఆర్ రాజ్యాంగ విరుద్ధం

ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్‌గాంధీ

పెళ్లి గురించి రాహుల్ ఆసక్తికర వ్యాఖ్యలు

రాహుల్ గాంధీకి కౌగలించుకుని ముద్దుపెట్టిన ఆగంతకుడు

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పేరిట బిహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వం పేదల ఓట్ల చోరీకి పాల్పడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం పూర్ణియా జిల్లా ఆరాలో ఆర్జేడీ ముఖ్యనేత తేజస్వీ యాదవ్‌తో కలిసి రాహుల్‌గాంధీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

04

## భార్యను ముక్కలు చేసి మూసీలో పారేశాడు

### 5 నెలల గర్భిణిని హతమార్చిన భర్త

హైదరాబాద్

బోడుప్పల్‌లో దారుణం

ఏడాదిన్నర క్రితం

ప్రేమ వివాహం

పెళ్లయిన మూడు నెలలకే

గొడవలు, గృహహింస కేసు

భార్య పుట్టింటికి వెళ్తానని

అడిగినందుకు మళ్లీ గొడవ

పథకం ప్రకారం హత్య

శవాన్ని ముక్కలు చేసి,

3 విడతల్లో నదిలోకి..

ఇంట్లోనే ఉన్న మొండెం

భార్య కనిపించడం లేదని

ఠాణాకు.. విచారణలో

హత్యను పసిగట్టిన

పోలీసులు.. నిందితుడి అరెస్టు



ప్రేమించి, పెద్దలను ఎదిరించి పెళ్లాడిన పక్కింటి కుర్రాడే ఆ యువతి పాలిట కాలయముడయ్యాడు. ఐదు నెలల గర్భిణి అని కూడా చూడకుండా.. కట్టుకున్న భర్తే ఆమెను హతమార్చాడు. ఆపై, చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నరరూప రాక్షసుడిగా మారిన ఆ భర్త.. భార్య శవాన్ని ముక్కలు ముక్కలు చేసి వాటిని విడతలవారీగా మూసీ నదిలో పారేశాడు.

03

## పార్టీ మారినోళ్లు దమ్ముంటే రాజీనామా చేయాలి

20 నెలల్లో చేసింది చెప్పి ఎన్నికల్లో గెలవాలి

బై ఎలక్షన్లు వస్తే.. కాంగ్రెస్‌కు బై బై: కేటీఆర్



03

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు దమ్ముంటే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. 20 నెలల పాలనలో రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రజలకు చేసిన మంచిని చూపించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు.

## స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

ఆ దిశగా బీజేపీ సోషల్ మీడియా పనిచేయాలి

బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రేమ్ శుక్లా

గిట్టని వారు పార్టీలో విభేదాలు సృష్టిస్తారు

కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలి: రాంచందర్‌రావు



02

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
25 ఆగస్టు
2025





# సురవరానికి తుది వీడ్కోలు



మొదటి పేజీ తరువాయి

సంఘాల నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు సురవరం భౌతిక కాయానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించేందుకు అంతిమ యాత్ర మొదలైంది. ఇందులో భాగంగా హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు పోలీసుల మార్చ్ సాగింది. అక్కడి నుంచి రెడ్ వాలంటీర్లు కవాతు చేశారు. నారాయణగూడ చౌరస్తా, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, మ-ుషీరాబాద్ మీదుగా యాత్ర సాగింది. సాయంత్రం 4.45 గంటలకు సురవరం భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా విప్లవ జోహార్లు అంటూ కార్యకర్తలు పాటలు పాడుతూ సుధాకర్‌రెడ్డికి కడసారి వీడ్కోలు పలికారు.

**రేవంత్, చంద్రబాబు నివాళి..**

సీపీఐ దిగ్గజ నేత సురవరం సుధాకర్ రెడ్డి పేరును శాశ్వతంగా గుర్తుండేలా చేస్తామని, ఈ మేరకు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలకు ఆదర్శంగా నిలిచిన వారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. మఖ్దూం భవన్‌లో సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి రేవంత్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును హార్టికల్చర్ యూనివర్సిటీకి, జైపాల్‌రెడ్డి పేరును పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నామకరణం చేసి వారిని గౌరవించుకున్నామని, అదే కోవలో సుధాకర్‌రెడ్డి పేరు కూడా శాశ్వతంగా నిలిచిపోయేలా చేస్తామని తెలిపారు. సుధాకర్‌రెడ్డి లాంటి గొప్ప నాయకుడిని కోల్పోవడం చాలా బాధాకరమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. చిన్ననాటి నుంచి ప్రజల పక్షాన నిలబడి.. ప్రజల కోసం పోరాడారని కొనియాడారు. సురవరం మృతి సీపీఐకి, దేశానికి తీరని లోటని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి చంద్రబాబు అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురవరంతో తనకు సుదీర్ఘ స్నేహం ఉందని చంద్రబాబు తెలిపారు. ఆయనకు అనేక ఉద్యమాలు నడిపిన అనుభవం ఉందని అన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సురవరం భౌతిక కాయానికి నివాళులు అర్పించి, సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, జానారెడ్డి, కోదండరాం తదితరులు సురవరం భౌతిక కాయానికి నివాళులర్పించారు.

**సురవరం మద్దతు మరువలేనిది : కేటీఆర్**

తెలంగాణ ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించి చిరస్మరణీయ ముద్ర వేసుకున్న సురవరం సుధాకర్‌రెడ్డి మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సురవరం భౌతిక కాయానికి ఆది వారం ఆయన నివాళులు అర్పించారు. సురవరంతో ఉన్న అనుభవాలను కేసీఆర్ గుర్తుచేసుకున్నారని, కేసీఆర్ తరఫున సుధాకర్ రెడ్డికి నివాళులర్పిస్తున్నామని చెప్పారు. మాజీ మంత్రులు హరీశ్‌రావు, పలువురు బీఆర్ఎస్ నేతలు సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించారు. సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాస్, అల్లం నారాయణ, ఘంటా చక్రపాణి, జయ ప్రకాష్ నారాయణ, మాజీ సీజేఐ ఎన్వీ రమణ తదితరులు సుధాకర్‌రెడ్డికి నివాళులు అర్పించారు.


## స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి

**ఆ దిశగా బీజేపీ సోషల్ మీడియా పనిచేయాలి**

**బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రేమ్ శుక్లా**

**గిట్టని వారు పార్టీలో విభేదాలు సృష్టిస్తారు**

**కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలి: రాంచందర్‌రావు**



**చంపాపేట :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలని, రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు ఏర్పాటే లక్ష్యంగా పార్టీ సోషల్ మీడియా పని చేయాలని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, పార్టీ సోషల్ మీడియా జాతీయ కన్వీనర్ ప్రేమ్ శుక్లా అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడానికి స్థానిక సంస్థల ఎన్నికలే తొలిమెట్టు అని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు చేరవేయాలని కోరారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్‌లోని ఆదివారం స్థానిక సంస్థల ఎన్నికల బీజేపీ మీడియా, ఐటీ సోషల్ మీడియా రాష్ట్ర స్థాయి వర్క్‌షాపను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేమ్ శుక్లా మాట్లాడారు. దేశవ్యాప్తంగా బీజేపీ ఘన విజయానికి సోషల్ మీడియా ప్రధాన ఆయుధం అని అన్నారు. ఆరు గ్యారంటీలను నెరవేర్చడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు సోషల్ మీడియా కార్యకర్తలను కోరారు. గిట్టని వారు పార్టీలోనే విభేదాలు సృష్టిస్తారని, అటువంటి వాటి పట్ల కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని, పనులు మాత్రం గడప దాటడం లేదని ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు.

# మన మేధావులు మన కోసం!

మొదటి పేజీ తరువాయి



తెలిపారు. విద్యాసంస్థలతో పరిశోధకులను అనుసంధానించడంతోపాటు పరిశోధన, ఆవిష్కరణలు, స్కిల్ వర్సిటీలతో కలిపే ప్రయత్నం చేస్తామన్నారు. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో జరుగుతున్న ఆసియా-ఫసిఫిక్ బయో డిజైన్ ఇన్నొవేషన్-2025 సదస్సును ప్రారంభించడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్లు, పరిశోధకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. బయో డిజైన్‌ను ఉపయోగించి వైద్య ఉత్పత్తులలో ఆవిష్కరణలపై ఇక్కడ చర్చించడం సంతోషంగా ఉందన్నారు. దేవుడు గొప్ప డిజైనర్ అని, ప్రకృతి అత్యుత్తమ టీచర్ అని, కానీ.. మనం మంచి విద్యార్థులుగా ఉంటున్నామా అనేదే ప్రశ్న అని అన్నారు. ప్రకృతిని పరిశీలించడంతోపాటు దాని నుంచి నేర్చుకుంటే వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం రాదన్నారు. బయో డిజైన్‌కు సంబంధించి కృత్రిమ మేధస్సు దీనికి చక్కటి ఉదాహరణగా పేర్కొన్నారు. మనుషులు కృత్రిమ మెదడును రూపొందించడానికి మానవ మెదడు ఉపయోగిస్తున్నారని గుర్తుచేశారు. తమ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. భారతదేశపు లైఫ్ సైన్సెస్, మెడికల్ డివైజెస్, టెక్నాలజీ రంగాలకు కేంద్రంగా తెలంగాణ వెలుగొందుతోందని, సాంకేతిక రంగాన్ని అత్యంత కీలకంగా తాము భావిస్తున్నామని వివరించారు. ఫార్మా, ఐటీ, బయోటెక్, లైఫ్‌సైన్సెస్, మెడికల్ టెక్నాలజీలకు నిలయంగా హైదరాబాద్ వెలుగొందుతోందని, ఈ రంగాల్లో తయారీ నుంచి ఆవిష్కరణల వరకూ మనం ఎదిగామని అన్నారు.

**సుల్తాన్‌పూర్‌లో మెడికల్ డివైజెస్ పార్క్..**

దేశంలో అతి పెద్ద మెడికల్ డివైజెస్ పార్క్‌ను తాము సుల్తాన్‌పూర్‌లో ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ తెలిపారు. అక్కడ పరిశోధన, ప్రొటోటైపింగ్, టెస్టింగ్, తయారీకి సంబంధించి అత్యుత్తమ మౌలిక సదుపాయాలున్నాయని అన్నారు. దాదాపు 60 కంపెనీలు అక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని చెప్పారు. డయాగ్నస్టిక్ డివైజెస్, ఇమేజింగ్ టెక్నాలజీస్, ఇంప్లాంట్స్, సర్జికల్ ఎక్విపమెంట్స్, డిజిటల్ హెల్త్ సొల్యూషన్స్ విభాగాల్లో పెట్టుబడులు అధికంగా వస్తున్నాయని వివరించారు. అంతర్జాతీయ కంపెనీలతోపాటు స్థానిక స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలు ఈ రంగాలలో చక్కగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ప్రశంసించారు. హైదరాబాద్‌ను ఇవి వినూత్న స్థానంలో నిలుపుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో నైపుణ్యంతో కూడిన మానవ వనరులున్నాయని, చక్కటి విద్యాసంస్థలు, నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలు, విద్య-పరిశ్రమ భాగస్వామ్యాలు దీనికి తోడ్పడుతున్నాయని పేర్కొన్నారు. సామాన్య భారతీయుల సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో ఈ తరహా సదస్సులను ఏర్పాటు చేయడంతోపాటు పరిశోధనలు చేస్తున్న ఏఐజీని, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్నట్లు తెలిపారు.

**బయో డిజైన్‌కు కేంద్రంగా హైదరాబాద్..**

దేశంలో బయో డిజైన్‌కు కేంద్రంగా హైదరాబాద్ నిలవనుందని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అల్పాదాయ వర్గాలకు సైతం మెరుగైన ఆరోగ్య సేవలందించే అవకాశం బయో డిజైన్ ఉత్పత్తులతో కలుగుతుందన్నారు. హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ జీవీ రావు.. భారత్ బయోడిజైన్ విజన్ డాక్యుమెంట్ గురించి వివరించారు. ఏఐ మెడ్‌టెక్ అలయెన్స్‌తో కలిసి ఏఐజీ హాస్పిటల్స్ 'ఇన్నోవేటింగ్ ఫర్ భారత్ బయోడిజైన్ బ్లూ ప్రింట్' పేరిట ఈ డాక్యుమెంట్‌ను రూపొందించిందన్నారు. కాగా, బయో డిజైన్ పరంగా అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 10 మంది నిపుణులు హైదరాబాద్‌కు వచ్చారని ఏఐఎం ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ కల్పల చెప్పారు.

## వ్యవస్థల్ని నియంత్రిస్తే ఊరుకోం

**అందరూ చట్టపరిధిలో పని చేయాల్సిందే**

**సినీ నిర్మాతలు, దర్శకులతో సీఎం రేవంత్‌రెడ్డి**

**అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన తెలుగు సినిమా**

**ఇలాంటి పరిస్థితుల్లో వివాదాలు ఉండకూడదు**

**త్వరలో సినీ కార్మికులను పిలిచి మాట్లాడతా**

**స్కిల్ యూనివర్సిటీలో సినీ పరిశ్రమకు**

**అవసరమైన ఏర్పాట్లు చేస్తాం: సీఎం రేవంత్**



హైదరాబాద్, ఆగస్టు 24 : సినీ పరిశ్రమలో వ్యక్తులు.. వ్యవస్థలను నియంత్రిస్తామంటే ప్రభుత్వం సహించబోదని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అందరూ చట్టపరిధిలో పనిచేయాల్సిందేనని తేల్చిచెప్పారు. తెలుగు సినీ పరిశ్రమను అంతర్జాతీయ స్థాయిలో ఉంచడమే తన ధ్యేయమని చెప్పారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో తెలుగు సినీ నిర్మాతలు, దర్శకులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినీ పరిశ్రమకు పర్యవేక్షణ అవసరమని, ఇండస్ట్రీకి ఏం కావాలనే దానిపై ఒక కొత్త పుస్తకం రాసుకుందామని అన్నారు. హైదరాబాద్‌లో అంతర్జాతీయ స్థాయి సినిమాల చిత్రీకరణ కూడా జరుగుతోందని, తెలుగు సినిమాల చిత్రీకరణ ఎక్కువగా రాష్ట్రంలోనే జరిగేలా చూడాలని సూచించారు. తెలుగు సినిమా పరిశ్రమ అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందని, ఇలాంటి పరిస్థితుల్లో ఇండస్ట్రీలో వివాదం ఉండకూడదనే కార్మికుల సమ్మె విషయంలో తాను చొరవ చూపించానని తెలిపారు. త్వరలోనే సినీ పరిశ్రమలోని కార్మికులతోనూ మాట్లాడతానన్నారు. అయితే కార్మికుల పట్ల నిర్మాతలు మానవత్వంతో వ్యవహరించాలని, ఈ విషయంలో సంస్కరణలు అవసరమని సీఎం అభిప్రాయపడ్డారు.

కార్మికులు, నిర్మాతలను తమ ప్రభుత్వం కాపాడుకుంటుందని, వారితోపాటు ప్రభుత్వమూ కలిసి ఒక పాలసీ తీసుకువస్తే బాగుంటుందని పేర్కొన్నారు. పరిశ్రమకు కొత్తగా వచ్చేవారిలో నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ అంశాల్లో నైపుణ్యాల పెంపు కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ఇక సినిమా పరిశ్రమ కోసం స్కిల్ యూనివర్సిటీలో అవసరమైన ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. కాగా, ప్రభుత్వం నుంచి సినీ పరిశ్రమకు పూర్తి సహకారం ఉంటుందని సీఎం చెప్పినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, నిర్మాతలు అల్లు అరవింద్, డి.సురేషబాబు, జెమిని కిరణ్, స్రవంతి రవికిశోర్, నవీన్ ఎర్నేని తదితరులతోపాటు దర్శకులు త్రివిక్రమ్, బోయపాటి శ్రీనివాస్, సందీపరెడ్డి వంగా, వంశీ పైడిపల్లి, అనిల్ రావిపూడి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఢిల్లీకి వెళ్లనున్న మంత్రుల కమిటీ

**జస్టిస్ సుదర్శన్‌రెడ్డితో సంప్రదింపులు**

**ప్రముఖ న్యాయకోవిదులు, నిపుణులతోనూ**

**సీఎం రేవంత్ కూడా హాజరయ్యే అవకాశం!**

**నేడు ఢిల్లీకి ముఖ్యమంత్రి.. రేపు బిహార్‌కు..**

**రాహుల్ పాదయాత్రలో పాల్గొననున్న సీఎం**



**హైదరాబాద్, ఆగస్టు 24 :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ఉన్న అవకాశాలపై న్యాయకోవిదుల సలహా కోరేందుకు మంత్రుల కమిటీ సోమవారం ఢిల్లీకి వెళ్లనుంది. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నేతృత్వంలోని ఈ కమిటీ.. ఢిల్లీలో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని సంప్రదించనుంది. ఆయనతోపాటు ఢిల్లీలోని ప్రముఖ న్యాయ కోవిదుల అభిప్రాయాలనూ తీసుకోనుంది. ఆదివారం ప్రజాభవన్‌లో సమావేశమైన మంత్రుల కమిటీ.. ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయకోవిదులు, రాజ్యాంగ నిపుణులను సంప్రదించేందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్కతో కమిటీ ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ కమిటీ.. న్యాయకోవిదులతో సంప్రదింపుల ప్రక్రియను మంగళవారం కల్లా పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రజాభవన్‌లో కమిటీ సమావేశమై.. రిజర్వేషన్ల విషయంలో వివిధ కోర్టులు ఇచ్చిన తీర్పులు ఎలా ఉన్నాయి? ఇతర రాష్ట్రాల్లో రిజర్వేషన్లను ఏ విధంగా అమలు చేస్తున్నారు? వంటి అంశాలను ప్రాథమికంగా పరిశీలించింది. న్యాయపరంగా వివాదాలు రాకుండా.. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించేందుకు ఉన్న మార్గాలపై అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి అభిప్రాయాన్ని మంత్రులు తెలుసుకున్నారు. విస్తృత అభిప్రాయ సేకరణకుగాను జాతీయ స్థాయిలో ప్రముఖ న్యాయ కోవిదులు,రాజ్యాంగ నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలని నిర్ణయించారు.

**బిహార్ టూర్.. వయా ఢిల్లీ..**

రాష్ట్రంలో చేపట్టిన కులగణన సర్వే నివేదికను అధ్యయనం చేసి.. సూచనలు చేసేందుకు ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆ కమిటీ చైర్మన్, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థి అయిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అభిప్రాయాన్ని సోమవారం తీసుకోవాలని మంత్రుల కమిటీ నిర్ణయించింది. ఆయనతోపాటు ప్రముఖ న్యాయవాది, రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మనుసింఘ్వీ సలహా కూడా తీసుకోనున్నారు. ప్రస్తుతం ఉప రాష్ట్రపతి ఎన్నికల ప్రచారంలో ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి.. సోమవారం ఢిల్లీకి వెళుతున్నారు. దీంతో శ్రీధర్‌బాబు మినహా మంత్రుల కమిటీ సభ్యులు కూడా ఢిల్లీకి వెళ్లనున్నారు. అక్కడే జస్టిస్ సుదర్శన్‌రెడ్డితోపాటు ఇతర న్యాయ కోవిదులనూ కలిసి అభిప్రాయం తీసుకోనున్నారు. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి కూడా సోమవారం మధ్యాహ్నం ఢిల్లీకి వెళుతున్నారు. మంగళవారం ఢిల్లీ నుంచి బిహార్ రాజధాని పట్నాకు చేరుకుంటారు. 'ఓటు చోరీ' అంశంపై ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రస్తుతం బిహార్‌లో చేస్తున్న పాదయాత్రలో రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. రేవంత్‌తోపాటు రాష్ట్ర మంత్రులు, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, ఇతర ముఖ్య నాయకులూ పాల్గొననున్నారు. ఢిల్లీ మీదుగా బిహార్‌కు చేరుకోనున్నారు. కాగా, సోమవారం స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించేందుకు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, అభిషేక్ మనుసింఘ్వీతో మంత్రుల కమిటీ భేటీలో సీఎం రేవంత్ కూడా పాల్గొనే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
25 ఆగస్టు
2025






# డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డికి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు

## విద్యారంగానికి వన్నె తెచ్చిన డా. కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి డాక్టర్ గోపాల్ కి డా. సర్వపల్లి రాధాకృష్ణన్ అవార్డు వరించడం పట్ల సర్వత్రా హర్షం.





**హైదరాబాద్ రోమింగ్ న్యూస్:** లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి విద్యారంగంలో చేసిన అపారమైన కృషికి గుర్తింపుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ అవార్డు లభించింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.

ఎడ్యూటెక్, ట్రస్మా సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమం హైదరాబాద్‌లోని జన్వాడ నియో కన్వెన్షన్ హాల్‌లో కన్నుల పండుగగా నిర్వహించారు. ఏక్ ఉపదేశ్ మీడియా డైరెక్టర్ కుల్దీప్ సింగ్, అసిస్టెంట్ డైరెక్టర్ కుల్వంత్ సింగ్, ట్రస్మా రాష్ట్ర శాఖ అధ్యక్షులు సాదుల మధుసూదన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. రమేష్ కుమార్, కోశాధికారి రాఘవేంద్ర రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు లక్ష్మణ్ ల చేతుల మీదుగా డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తికి దక్కిన గౌరవం మాత్రమే కాదు, డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి గత 33 సంవత్సరాలుగా గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తు కోసం నిర్మించిన ఒక విద్యా దేవాలయానికి లభించిన సత్కారంగా వక్తలు అభిప్రాయపడ్డారు.

**పేద విద్యార్థుల కోసం ఒక కల....**

డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి 33 సంవత్సరాల క్రితం ఈ స్కూల్‌ను ప్రారంభించినప్పుడు ఆయనకు ఒకే ఒక్క లక్ష్యం ఉంది... గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కూడా నాణ్యమైన విద్యను అందించాలి. అనేక ఆర్థిక సవాళ్లను ఎదుర్కొని, ఆయన నేడు ఆ కలను నిజం చేశారు. స్కూల్ కేవలం ఒక విద్యా సంస్థగా కాకుండా, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆశాదీపంగా నిలిచిందనీ వారు వివరించారు.

**విజయాలకు చిరునామా లోటస్ ల్యాప్ విద్యార్థులు...**

డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మార్గదర్శనంలో, ఈ స్కూల్లో విద్యనభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు ఈరోజు దేశంలోని వివిధ రంగాలలో అత్యున్నత స్థానాలను అధిరోహించారు. వారిలో డాక్టర్లు, ఇంజనీర్లు, మరియు పలు ప్రభుత్వ విభాగాల్లో తమ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వర్తిస్తున్న ఉద్యోగులు ఉన్నారు. ఇది స్కూల్ అందించిన నాణ్యమైన విద్యకు, మరియు విద్యార్థుల అంకితభావానికి నిదర్శనం.వేలాదిమంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించి, స్కూల్‌కు గొప్ప కీర్తిని తీసుకొచ్చారు. ఈ అసాధారణ విజయం స్కూల్ విద్యా ప్రమాణాలను, మరియు విద్యార్థుల నిబద్ధతను చాటిచెబుతోంది.

**ఈ అవార్డు నా బాధ్యతను పెంచింది.**

ఈ అవార్డును అందుకున్న సందర్భంగా డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, "ఈ పురస్కారం నా బాధ్యతను మరింత పెంచింది. నా విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు నా కుటుంబం సహకారం లేకపోతే ఈ విజయం సాధ్యమయ్యేది కాదు" అని తెలిపారు. ఆయన కృషి, నిస్వార్థ సేవ, మరియు విద్యార్థులపై చూపించిన ప్రేమకు ఇది ఒక అద్భుతమైన గుర్తింపు. లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్స్ ఒక విద్యా సంస్థగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే ఒక విజయగాథగా నిలిచింది. డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి కృషిని విద్యార్థులు, ఉపాధ్యాయులు, మరియు స్థానికులు ఎంతగానో అభినందిస్తున్నారు.





# యాదగిరిగుట్ట.. భక్తుల కిటకిట

## ధర్మదర్శనానికి 3 గంటలు, స్పెషల్ దర్శనానికి గంట సమయం

### ఆలయ ఖజానాకు రూ.55.26 లక్షల ఇన్ కమ్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. హైదరాబాద్ సహా రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో.. ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కారణంగా.. బస్ బే, ధర్మదర్శన, ప్రత్యేక దర్శన క్యూలైన్లు, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం, కల్యాణకట్ట, లక్ష్మీపుష్కరిణి, వ్రత మండపాలు కిక్కిరిశాయి. రద్దీ కారణంగా స్వామివారి ధర్మదర్శనానికి మూడు గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి గంట సమయం పట్టింది. ఇక ఆలయంలో నిర్వహించిన నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా ఆలయంలో నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలైన నిత్య పూజలు.. రాత్రి పవళింపుసేవ, శయనోత్సవ సేవతో ముగిశాయి. ఇక భక్తులు జరిపించిన నిత్య పూజలు, నిత్య కైంకార్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.55,26,706 ఆదాయం వచ్చింది. ప్రసాద విక్రయం ద్వారా రూ.20,64,680, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6.50 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ.10.20 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.4,99,500 ఇన్ కమ్ వచ్చినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

**నారసింహుడి సేవలో ఎంబీసీ చైర్మన్**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్ దర్శించుకున్నారు. ఫ్యామిలీతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నరసింహస్వామిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం చేయగా.. ఆలయ ఏఈవో రమేష్ బాబు, సూపరింటెండెంట్ రాజన్ బాబు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.

# జాతీయ స్థాయి కరాటే కుంగ్ ఫు పోటీల్లో ఎస్.వీ.ఎన్ మహోన్నత్‌కు గోల్డ్ మెడల్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: హైదరాబాద్ జీడిమెట్ల లోని టైగర్స్ కుంగ్ ఫు అకాడమీ వారి 26వ జాతీయస్థాయి కరాటే కుంగ్ ఫు ఛాంపియన్షిప్ 2025 పోటీల్లో యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్ కు చెందిన మూడో తరగతి విద్యార్థి నక్క మహోన్నత గోల్డ్ మెడల్ సాధించారు. నక్క మహోన్నత్ జూనియర్స్ బాలుర కటాస్ విభాగంలో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ గెలుపొందారు. లెజెండరీ గ్రాండ్ మాస్టర్ వీరాచారి గ్రాండ్ మాస్టర్ శివకోటి రాష్ట్ర సెక్రటరీ మాస్టర్ ఎం శ్రీనివాస్ గెలుపొందిన విద్యార్థికి గోల్డ్ మెడల్ అందజేయడం జరిగింది. చెందిన శిక్షణ ఇచ్చిన మాస్టర్ ఎర్ర మహేశ్ మరియు విద్యార్థి ని మాస్టర్స్ అభినందించారు.

# భక్తిభావంతో సన్మార్గంలో పయనించవచ్చు

## ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: దేవుని పట్ల భక్తిభావం పెంచుకుంటే చెడు అలవాట్లు దూరమై సన్మార్గంలో పయనించడానికి మార్గం సుగమం అవుతుందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఆదివారం యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో మాజీ వార్డు సభ్యుడు కళ్లెం విజయ జహంగీర్ గౌడ్ ఇంట్లో నిర్వహించిన బాలమ్మ తల్లి పండుగలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పండుగకు వచ్చిన గ్రామస్తులతో కలిసి భోజనం చేశారు. తర్వాత అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన ఫొటోను ఎమ్మెల్యే అయిలయ్యకు విజయ జహంగీర్ గౌడ్ దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతన అలవర్చుకుంటే అనుకున్నది సాధించవచ్చని తెలిపారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా చేసే పనుల పట్ల ఏకాగ్రత పెరిగి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. ఇటీవల కాలంలో యువత చెడు వ్యసనాలకు అలవాటై జీవితాన్ని నాశనం చేసుకుంటున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా యువత ఆధ్యాత్మిక భావన, దేవుని పట్ల ఆరాధన పెంచుకుంటే చెడు ప్రభావాలు తొలగి భవిష్యత్తులో అనుకున్నది సాధించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చైతన్యా మహేందర్ రెడ్డి, మండల కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండీ యాకూబ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎలేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సత్యప్రకాశ్ గౌడ్, మండల నాయకుడు కోల కృష్ణ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

# హన్మాపురం గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

## వడపర్తి నుండి చీకటి మామిడి వరకు రెండు వరుసల(డబుల్) రోడ్డును వెంటనే పూర్తి చేయాలి : సిపిఎం డిమాండ్



**భువనగిరి, రోమింగ్ న్యూస్:** హన్మాపురం గ్రామంలో 2023లో శంకుస్థాపన చేసి 70 శాతం నిర్మాణం పూర్తి చేసిన గ్రామపంచాయతీ భవనానికి మరిన్ని నిధులు కేటాయించి పూర్తిస్థాయి నిర్మాణం చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. వడపర్తి మెయిన్ రోడ్డు నుండి చీకటిమామిడి గ్రామం వరకు రెండు వరుసల రోడ్డును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని అన్నారు. ఆదివారం సిపిఎం పోరు బాటలో భాగంగా భువనగిరి మండలం హన్మాపురం, వడపర్తి గ్రామాలలో సిపిఎం నాయకులు, కార్యకర్తలు ఆయా గ్రామాలకు సంబంధించిన ప్రజలకు కలిసి సమస్యలను అధ్యయనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా హన్మాపురం గ్రామంలో అసంపూర్తిగా నిర్మాణం జరిగిన గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తి చేయాలని " నిరసన " కార్యక్రమం, వడపర్తి మెయిన్ రోడ్డు నుండి నుండి చీకటిమామిడి వరకు రెండు వరుసల (డబల్ రోడ్డు) రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తిచేయాలని " రాస్తారోకో " కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం ఎస్.డి.ఎఫ్ నిధుల కింద 20 లక్షల రూపాయలు గ్రామపంచాయతీ నిర్మాణానికి మంజూరు చేయగా 70 శాతం భవనం పూర్తయిందని మిగతా పనులు కావాలంటే ఇంకా ఐదు నుండి పది లక్షల రూపాయలు అవసరం ఉన్నాయని అన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బిల్డింగ్ నిర్మాణ విషయంలో ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. నిర్మాణం జరుగుతున్న బిల్డింగ్ ప్రదేశములో పిచ్చి మొక్కలతో చెత్తాచెదారంతో భవనము కూడా శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి ఉందని అన్నారు. కనీసం గ్రామ పంచాయతీ కార్యదర్శి నూతన గ్రామపంచాయతీ నిర్మాణ ప్రదేశంలో పేరుకుపోయిన చెత్తను, కంప చెట్లను తొలగించే పరిస్థితుల్లో లేరని అన్నారు. స్థానిక శాసనసభ్యులకు గ్రామ ప్రజలు అనేకమార్లు దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు స్పందించి తగిన నిధులు కేటాయించి గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని నర్సింహ సూచించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య మాట్లాడుతూ భువనగిరి జిల్లా కేంద్రం నుంచి బొమ్మలరామారం వరకు ప్రధాన రోడ్డుగా ఉన్న వడపర్తి మెయిన్ రోడ్డు నుండి చీకటిమామిడి వరకు రెండు వరుసల (డబల్ రోడ్డు) కోసం ఉన్న రోడ్డును తోవ్వి నాలుగు నెలలు గడుస్తున్న పనులు మాత్రమే జరగడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. మట్టి, కంకర పోయడం వల్ల ప్రయాణికులు ఆ రోడ్డు వెంబడి ప్రయాణించడం వల్ల అనేక ప్రమాదాలకు గురవుతున్నారని, వడపర్తి గ్రామంలో దుమ్ము, దూళితో, కంకర తేలి ప్రజలకు దెబ్బలు తాకి గాయపడుతున్నారని అన్నారు. నెల రోజులలో రోడ్డును పూర్తి చేస్తామన్న కాంట్రాక్టర్, అధికారులు నాలుగు నెలలైనా పనులు పూర్తి చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులను పూర్తి చేసి ప్రయాణికుల, ప్రజల ప్రాణాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పాండాల మైసయ్య , హన్మాపురం సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి మోటె ఎల్లయ్య , వడపర్తి శాఖ కార్యదర్శి పాండాల అంజయ్య తోపాటు రెండు గ్రామాలకు సంబంధించిన సిపిఎం పార్టీ సభ్యులు, ప్రజలు బండి శ్రీను, దయ్యాల మల్లేష్ , రాగాల రాజేశ్వర్, తోటకూరి నాగరాజు, కుసుమ మదు, పాండాల బాలరాజు, ముదుగుల రాజు, గంగనబోయిన రాజు, ఎర్రబోయిన మల్లేష్ రాపాక రమేష్ , గోరంతల ఉమేష్ , కొండ మనోజ్, తాటికొండ పోషమల్లు, నర్సింహ పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
25 ఆగస్టు
2025





# భార్యను ముక్కలు చేసి మూసీలో పారేశాడు

**హైదరాబాద్ బోడుప్పల్‌లో దారుణం**

**ఏడాదిన్నర క్రితం ప్రేమ వివాహం**

**పెళ్లయిన మూడు నెలలకే గొడవలు, గృహహింస కేసు**

**భార్య పుట్టింటికి వెళ్తానని అడిగినందుకు మళ్లీ గొడవ పథకం ప్రకారం హత్య**

**శవాన్ని ముక్కలు చేసి, 3 విడతల్లో నదిలోకి..**

**ఇంట్లోనే ఉన్న మొండెం**

**భార్య కనిపించడం లేదని ఠాణాకు..**

**విచారణలో హత్యను పసిగట్టిన పోలీసులు.. నిందితుడి అరెస్టు**



**హైదరాబాద్** : ప్రేమించి, పెద్దలను ఎదిరించి పెళ్లాడిన పక్కింటి కుర్రాడే ఆ యువతి పాలిట కాలయముడయ్యాడు. ఐదు నెలల గర్భిణి అని కూడా చూడకుండా.. కట్టుకున్న భర్తే ఆమెను హతమార్చాడు. ఆపై, చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నరరూప రాక్షసుడిగా మారిన ఆ భర్త.. భార్య శవాన్ని ముక్కలు ముక్కలు చేసి వాటిని విడతలవారీగా మూసీ నదిలో పారేశాడు. మొండాన్ని మాత్రం ఇంట్లోనే ఉంచి.. నా భార్య కనిపించడం లేదు సాయం చెయ్యండంటూ పోలీసుస్టేషన్‌కు వెళ్లిన ఆ కిరాతకుడు.. విచారణలో పోలీసులకు దొరికిపోయాడు. హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్, మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోడుప్పల్‌లో వెలుగుచూసిన ఈ ఘటనలో వికారాబాద్ జిల్లా కామారెడ్డిగూడకు చెందిన స్వాతి(21) తన భర్త చేతిలో దారుణ హత్యకు గురైంది. ఇందుకు సంబంధించిన వివరాలను మల్కాజిగిరి డీసీపీ పద్మజ ఆదివారం విలేకరులకు వెల్లడించారు.

**పెళ్లయిన మూడు నెలలకే వేధింపులు**

డీసీపీ కథనం ప్రకారం.. కామారెడ్డిగూడలో పక్కపక్క ఇళ్లలో ఉండే మహేందర్‌రెడ్డి (27), స్వాతి (21) ప్రేమించుకున్నారు. వేర్వేరు కులాలకు చెందిన వీరి ప్రేమను పెద్దలు అంగీకరించకపోవడంతో ఎవ్వరికీ తెలియకుండా గతేడాది జనవరిలో కూకట్‌పల్లిలోని ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. అనంతరం స్వగ్రామంలో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరగ్గా సయోధ్య కుదుర్చిన పెద్దలు.. యాదగిరిగుట్టలో మరోమారు పెళ్లి చేశారు. అనంతరం వీరు బోడుప్పల్‌లోని బాలాజీనగర్‌లో కాపురం పెట్టారు. ఇంటర్ వరకు చదివిన మహేందర్ రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తుండగా, డిగ్రీ మధ్యలోనే ఆపేసిన స్వాతి టెలీకాలర్‌గా పని చేస్తోంది. అయితే, పెళ్లయిన నెల రోజులు తర్వాత దంపతుల మధ్య మనస్ఫర్థలు మొదలయ్యాయి. పెళ్లయిన రెండు నెలలకే స్వాతి గర్భం దాల్చగా వద్దని చెప్పి మహేందర్ రెడ్డి అబార్షన్ చేయించాడు. ఆ తర్వాత భర్త వేధింపులు భరించలేకపోయిన స్వాతి వికారాబాద్ మహిళా పోలీసుస్టేషన్‌లో గృహహింస కేసు పెట్టింది. గ్రామపెద్దలు దంపతుల మధ్య రాజీ కుదిర్చారు. కానీ, స్వాతిపై కోపం పెట్టుకున్న మహేందర్ రెడ్డి ఆమెను మరింత వేధించడం మొదలుపెట్టాడు. స్వాతి తన తల్లిదండ్రులతో మాట్లాడకుండా, కలవకుండా కట్టడి చేసేవాడు. ఈ గొడవలు కొనసాగుతుండగా మరోమారు గర్భం దాల్చిన స్వాతి ఇటీవల స్వగ్రామానికి వెళ్లింది. మహేందర్ రెడ్డి వద్దకు వెళ్లనంటే పెద్దలు సర్దిచెప్పడంతో 20 రోజుల క్రితమే తిరిగి బోడుప్పల్‌కు వచ్చింది.

**గొంతు నులిమి చంపి.. ముక్కలు చేసి**

5 నెలల గర్భిణి అయిన స్వాతి వినాయకచవితికి పుట్టింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటానని 22వ తేదీ, శుక్రవారం భర్తకు చెప్పింది. ఇందుకు మహేందర్ రెడ్డి ఒప్పుకోకపోవడంతో ఆ రోజు రాత్రి ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. మరుసటి రోజు, శనివారం(ఆగస్టు 23) ఉదయం 11 గంటల వరకు స్వాతి నిద్ర లేవలేదు. అయితే, భార్యను అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్న మహేందర్.. ఉదయం 11:30 గంటలప్పుడు ఇంటి నుంచి బయటకు వెళ్లి సాయంత్రం నాలుగు గంటలకు తిరిగొచ్చాడు. వచ్చేటప్పుడు ఓ ఎక్సా బ్లేడు కొనుగోలు చేసి తెచ్చి ఇంట్లో దాచిపెట్టాడు. వెంటనే పథకం ప్రకారం భార్యతో గొడవ ప్రారంభించి ఆమె గొంతునులిమి చంపేశాడు. అనంతరం భార్య మృతదేహాన్ని మంచంపై పడేసి ఎక్సా బ్లేడుతో ముక్కలు చేశాడు. తల, కాళ్లు, చేతులను మొండం నుంచి వేరు చేసి ప్లాస్టిక్ కవర్లలో కుక్కి మూటగట్టాడు. మొండెంను మాత్రం ప్లాస్టిక్ కవర్‌లతో కప్పి ఒక దిండులా ప్యాక్ చేసి పక్కన పెట్టాడు. పరుపును మడిచి మూటగట్టి ఓ మూల పెట్టాడు. రాత్రి ఏడు గంటల తర్వాత ఒక్కో మూటను బ్యాక్‌ప్యాక్‌లో పెట్టుకుని ద్విచక్రవాహనంపై వెళ్లి ప్రతాపసింగారం ప్రాంతంలోని మూసీ నదిలో పారేశాడు.

**భార్య కనిపించడం లేదని నాటకం**

హత్యా నేరం నుంచి తప్పించుకునేందుకు మహేందర్ రెడ్డి మరో నాటకానికి తెర తీశాడు. మేము బానే ఉన్నాం, ఇప్పుడే భోజనం చేశామంటూ రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో స్వాతి ఫోన్ నుంచి ఆమె తల్లిదండ్రులకు మెసేజ్ పెట్టాడు. అలాగే, తన చెల్లికి ఫోన్ చేసి స్వాతి కనిపించడం లేదంటూ నమ్మబలికాడు. ఆ మాటలను నమ్మిని ఆమె.. వెంటనే తన భర్తను మహేందర్ రెడ్డి వద్దకు పంపింది. బావ వచ్చే లోపు కాళ్లు, చేతులు, తలను మహేందర్ రెడ్డి మూసీలో పడేశాడు. మహేందర్‌రెడ్డిని కలిసిన అతని బావ ఏం జరిగిదంటూ వాకబు చేశాడు. హత్య సంగతి దాచిపెట్టి భార్య కనిపించడం లేదని మహేందర్ రెడ్డి అతని వద్ద వాపోయాడు. దీంతో మిస్సింగ్ కేసు పెడదామని చెప్పి మహేందర్ రెడ్డిని అతని బావ రాత్రి 11 గంటల ప్రాంతంలో ఉప్పల్ పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లాడు. మహేందర్ రెడ్డి నివాసమున్న ప్రాంతం మేడిపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుందంటే రాత్రి 12 గంటలకు అక్కడికి చేరుకున్నారు. అయితే, కేసు నమోదులో భాగంగా ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి వేసిన ప్రశ్నలకు మహేందర్ రెడ్డి పొంతన లేని సమాధానాలు ఇవ్వగా.. ఇన్‌స్పెక్టర్ గట్టిగా ప్రశ్నించడంతో చేసిన దారుణాన్ని బయటపెట్టాడు. వెంటనే మహేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వైద్య పరీక్షల అనంతరం మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

**దొరకని స్వాతి శరీర భాగాలు**

మహేందర్‌రెడ్డి చెప్పిన వివరాల ప్రకారం దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం ఉదయం స్వాతి శరీర భాగాల కోసం మూసీలో గాలింపు చేపట్టారు. కానీ, మూసీలో వరద ఉండడంతో ఫలితం లేకపోయింది. స్వాతి మొండాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

ప్రేమంటూ నా బిడ్డను అంతం చేశాడు: స్వాతి తండ్రి

ప్రేమ పేరుతో నమ్మించి, పెళ్లి చేసుకొని లొంగదీసుకుని తమ బిడ్డను తమకు దూరం చేసిన మహేందర్ రెడ్డి.. ఇప్పుడు ఏకంగా ప్రాణాలు తీసేశాడంటూ స్వాతి తండ్రి రాములు మేడిపల్లి పోలీస్ స్టేషన్ వద్ద బోరున విలపించారు. పెళ్లయిన నెల రోజుల నుంచే వేధించడం మొదలుపెట్టాడని, ఇప్పుడు గర్భవతి అని తెలిసి కూడా దారుణంగా హతమార్చాడంటూ ఆయన రోదించారు. తమకు ఇష్టం లేని పెళ్లి చేసుకున్నా బిడ్డ బాగుంటే చాలు అనుకున్నామని, ఇలా జరుగుతుందని ఊహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహేందర్ రెడ్డిని కఠినంగా శిక్షించాలని వేడుకున్నారు. ఇక, శనివారం ఉదయమే స్వాతితో ఫోన్‌లో మాట్లాడానని, అర్ధరాత్రి రెండు గంటల తర్వాత పోలీసులు వచ్చి విషయం చెప్పడంతో గుండె పగిలినంత పనైందని స్వాతి తల్లి స్వరూప విలపిస్తున్నారు.

# పార్టీ మారినోళ్లు దమ్ముంటే రాజీనామా చేయాలి

**20 నెలల్లో చేసింది చెప్పి ఎన్నికల్లో గెలవాలి**

**బై ఎలక్షన్లు వస్తే.. కాంగ్రెస్‌కు బై బై: కేటీఆర్**



**హైదరాబాద్** : పార్టీ మారిన ఎమ్మెల్యేలకు దమ్ముంటే పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికల్లో పోటి చేసి గెలవాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సవాల్ విసిరారు. 20 నెలల పాలనలో రేవంత్ సర్కార్ తెలంగాణ ప్రజలకు చేసిన మంచిని చూపించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. బై ఎలక్షన్లు వస్తే.. కాంగ్రెసకు బై బై ఎలక్షన్ అయితదన్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో పార్టీ మారిన ఎమ్మెల్యేలకు ఓటమి భయం పట్టుకుందని పేర్కొన్నారు. మియాపూర్‌లో నిర్వహించిన శేరిలింగంపల్లి బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఈ ప్రాంత ఎమ్మెల్యేకు రెండు సార్లు బీఆర్ఎస్ టికెట్ ఇచ్చి గెలిపించామని, ప్రభుత్వ విప్ లాంటి పదవులు ఇచ్చి గౌరవించుకున్నామని, అయినప్పటికీ పార్టీ మారి కాంగ్రెసలోకి వెళ్లారని మండిపడ్డారు. భవిష్యత్తులో ఉపఎన్నికలు తప్పక వస్తాయని, కాంగ్రెస్‌కు రోజులు ముగియబోతున్నాయన్నారు. కాగా, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందు కు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ నలువైపులా నాలుగు టిమ్స్ (తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) ఆస్పత్రుల నిర్మాణాలను చేపట్టిందని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటి నిర్మాణాలను వేగంగా పూర్తిచేసి వైద్య సేవలు ప్రారంభించాలని ఆదివారం ఎక్స్ వేదికగా కోరారు.

# స్థానిక ఎన్నికల్లో బీసీలకు అవకాశం ఇస్తాం

**కేసీఆర్ బీసీ పక్షపాతి.. పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణ సభలో హరీశ్**



**గజ్వేల్** : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అవకాశం ఇస్తామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గోనెపల్లిలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహన్ని మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ.. బీసీలకు టికెట్ల విషయంలో కాంగ్రెస్ ఇప్పుడు మాటలు చెబుతోందని, గత పంచాయతీ రాజ్ ఎన్నికల్లోనే బీసీలకు 41 శాతం టికెట్లు ఇచ్చి కేసీఆర్ బీసీల పక్షపాతిగా నిలిచారని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎందరో గొప్ప పోరాట యోధుల చరిత్ర మరుగున పడిందని, తమ హయాంలోనే పాపన్నగౌడ్ చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చామని చెప్పారు. లండన్ విక్టోరియా మ్యూజియంలో పాపన్న గౌడ్ విగ్రహాన్ని పెట్టి బ్రిటన్ దేశం గౌరవించింది.. కానీ, మన పాలకులు గుర్తించకపోవడం బాధాకరమని తెలిపారు. దేశంలో ఎక్కడాలేని విధంగా గౌడ కులస్తులకు మద్యం దుకాణాల కేటాయింపుల్లో రిజర్వేషన్లు కల్పించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. అనంతరం సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లో డెంగీతో మృతి చెందిన నాయిని శ్రావణ్, కొంతం మహేశ్ కుటుంబాలను హరీశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పారిశుద్ధ్యం పడకేసిందని, గ్రామాల్లో విషజ్వరాలు అలుముకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహేశ్, శ్రావణ్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో 26వేల మెట్రిక్ టన్నుల యూరియాను బఫర్‌లో పెట్టామని.. కానీ ఈ ప్రభుత్వం రైతులకు కనీసం 3 వేల మెట్రిక్ టన్నులు కూడా ఇవ్వలేకపోయిందని విమర్శించారు.

**కర్షకులకు కాళరాత్రులు**

కాంగ్రెస్ పాలన కర్షకులకు మళ్లీ కాళరాత్రులను తెచ్చిందని, రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పినట్లుగానే ఆనాటి రోజులు గుర్తుచేస్తూ.. రైతన్నను నడిరోడ్డు మీదకు ఈడ్చారని హరీశ్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. యూరియా కోసం రైతులు పీఏసీఎస్ కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొందని ఆరోపించారు.

# మత్తు మందు ఇచ్చి బాలికపై అత్యాచారం

**భద్రాచలం ఏజెన్సీలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..**

**కొత్తగూడెం, ఆగస్టు 24** : అభం శుభం తెలియని ఓ గిరిజన బాలిక. తన కుటుంబ సభ్యులను చూడాలనుకుని ఎంతో ఆనందంతో స్వగ్రామానికి బయలుదేరింది. తన అన్నయ్యకు ఫోన్ చేసి ఇంటికి వస్తున్నానని చెప్పింది. అలాంటి బాలిక ఉసురు తీశారు కొందరు నీచులు. కన్నూమిన్నూ కానక.. ఆ 17ఏళ్ల బాలికపై అత్యాచారానికి ఒడిగట్టారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏపీలోని యేటపాక మండలానికి చెందిన ఆదివాసీ బాలికకు రెండేళ్ల క్రితం ఛత్తీసగఢ్‌లోని సుక్మా జిల్లాకు చెందిన యువకుడితో వివాహం జరిగింది. గతంలోనే బాలిక తల్లిదండ్రులు చనిపోగా.. పుట్టింటి వద్ద ఉంటున్న బంధువులను కలిసేందుకు కుంట మండల కేంద్రానికి చేరుకుంది. అక్కడి నుంచి ప్యాసింజర్ ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి ఉన్నట్టు సమాచారం. మార్గమధ్యలో ఆ ఇద్దరు వ్యక్తులు మద్యం తాగడంతో పాటు బాధితురాలికి మత్తు మందు కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి అత్యాచారానికి పాల్పడ్డారు. పాల్వంచ మండలం జగన్నాథపురం వద్ద అపస్మారక స్థితిలో ఉన్న సదరు బాలికను గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. బాలిక చెప్పిన వివరాల ఆధారంగా ఆమెపై అత్యాచారం జరిగినట్టుగా అనుమానించిన అధికారులు పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీడీపీవో లక్ష్మీప్రసన్న ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. బాలికను సంరక్షణ కేంద్రానికి తరలించారు. నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# కేంద్రం నిర్లక్ష్యం వల్లే యూరియా కొరత

**కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు సరికావు**

**11 ఏళ్లుగా లేని యూరియా కొరత..**

**ఇప్పుడెందుకు వచ్చిందో తెలియదా?**

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**హైదరాబాద్, ఆగస్టు 24** : రాష్ట్రంలో యూరియా కొరతపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యాఖ్యలు సరికావని, వాస్తవాలను దాచి ఉల్టా రాష్ట్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో 11 ఏళ్లుగా లేని యూరియా కొరత ఇప్పుడెందుకు వచ్చిందో తెలియదా? అని నిలదీశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డికి యూరియా కొరత ఎందుకు ఏర్పడిందో తెలియదా అని ప్రశ్నించారు. జియో పాలిటిక్స్, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఎర్ర సముద్రంలో నౌకాయానం నిలవడం వల్ల యూరియా దిగుమతి డిమాండ్‌కు తగ్గ స్థాయిలో లేదని కిషన్ రెడ్డి ఓ పక్క చెబుతూనే.. మరోపక్క యూరియా పక్కదారి పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని తుమ్మల మండిపడ్డారు. యూరియా దిగుమతులు లేకపోవడం, దేశీయంగా ఏర్పడిన కొరతపై కేంద్ర ప్రభుత్వం వాస్తవాలు దాచిపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్లక్ష్యం వల్ల యూరియా కొరత నెలకొంటే కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై బురదజల్లేలా వ్యాఖ్యలు చేయడం ఆయన స్థాయికి సరికాదన్నారు.

తెలంగాణ ప్రజల ఓట్లతో ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రి అయిన కిషన్‌రెడ్డి.. సొంత రాష్ట్ర రైతాంగం యూరియా కోసం ఇబ్బందులు పడుతుంటే ఎందుకు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా చొరవ తీసుకుని రాష్ట్రానికి యూరియా సరఫరా చేయించాలని డిమాండ్ చేశారు. వాస్తవ పరిస్థితులను రాష్ట్ర మంత్రులు రైతాంగానికి వివరిస్తుంటే.. తమపైనే అభాండాలు వేయడం మంచిది కాదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇది మూడో పంట కాలమని, ఏడాదిన్నరగా రైతులు యూరియా కోసం ఆదోళన చెందలేదని, ఈసారి కేంద్రం సరిపడా యూరియా సరఫరా చేయకపోవటంతోనే కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. కేంద్రం కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయకపోవడం వల్లే రైతులు ఆందోళనకు దిగుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ అలసత్వంతో ఏర్పడిన యూరియా కొరతపై వాస్తవాలు దాచి రాజకీయ ఆరోపణలు చేయటం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. కేంద్రం తెలంగాణకు ఆగస్టు 31 నాటికి 8.30 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని, కానీ ఇప్పటివరకు కేవలం 5.66 లక్షల మెట్రిక్ టన్నుల యూరియానే సరఫరా చేసిందని, దీంతో రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందన్నారు. కేంద్ర మంత్రి హోదాలో కిషన్ రెడ్డి బాధ్యతగా ప్రకటించిన 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా తక్షణమే సరఫరా అయ్యేలా చూడాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు.

# అనుమానంతో భార్యను కడతేర్చిన భర్త

**అడవిలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి దహనం**

**సోమశిల వెళ్దామని నమ్మించి దారుణం**

**మహబూబ్‌నగర్, ఆగస్టు 24** : ఓ యువకుడు తన భార్యకు వివాహేతర సంబం ధం ఉందనే అనుమానంతో అడవిలోకి తీసుకెళ్ళి హత్యచేసి, అనంతరం పెట్రోల్ పోసి కాల్చేసిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలంలోని కొత్తరాయవరం గ్రామానికి చెందిన శ్రీశైలం, దేవరకద్రకు చెందిన శ్రావణి (27) పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వారికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో శ్రావణి కొన్నాళ్లుగా పిల్లలతో కలిసి మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటోంది. శ్రీశైలం హైదరాబాద్‌లోని యూసుఫగూడలో వెల్డర్‌గా పని చేస్తున్నాడు. భార్యకు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో తరుచూ ఆమెతో గొడవ పడేవాడు.

విసిగిపోయిన ఆమె జనవరిలో మహిళా పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సోమశిలకు వెళ్ళివద్దామని నమ్మించిన శ్రీశైలం ఈ నెల 21న మహబూబ్‌నగర్‌కు వచ్చి, భార్యను బైక్‌పై తీసుకెళ్లాడు. పథకం ప్రకారం కత్తి, పెట్రోల్‌ను బైక్ కవర్‌లో ఉంచుకున్నాడు. పెద్దకొత్తపల్లి మండలంలోని సాతాపూర్ అడవిలోకి తీసుకెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడు. తర్వాత మృతదేహానికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. కూతురు నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో అనుమానించిన ఆమె తల్లి శనివారం టూటౌన్ పోలీసస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అదేరోజు రాత్రి శ్రీశైలం పోలీసుల వద్ద లొంగిపోయాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
25 ఆగస్టు
2025





# అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ పరీక్ష సక్సెస్




**న్యూఢిల్లీ :** భారత రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు పడింది. డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన అత్యాధునిక సమీకృత గగనతల రక్షణ ఆయుధ వ్యవస్థ (ఐఏడీడబ్ల్యూఎస)ను భారత్ విజయంతంగా పరీక్షించింది. శనివారం అర్ధరాత్రి 12:30 గంటలకు ఒడిశా తీరంలోని దీన్ని పరీక్షించినట్టు రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'ఐఏడీడబ్ల్యూఎస్ (ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్) అనేది డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన బహుళ అంచెల గగనతల రక్షణ వ్యవస్థ. దీనిలో స్వదేశీయంగా అభివృద్ధి చేసిన క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (క్యూఆర్‌ఎసఏఎం), అడ్వాన్స్‌డ్ వెరీ షార్ట్ రేంజ్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ (వీఎసహెచ్‌వోఆర్‌ఏడీఎస్) మిస్సైల్స్, హైపవర్ లేజర్-బేస్డ్ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్ (డీఈడబ్ల్యూ) ఉన్నాయి' అని రాజ్‌నాథ్ సింగ్ ట్వీట్ చేశారు. ఇదిలా ఉండగా, సముద్ర తీరప్రాంత గస్తీని బలోపేతం చేసుకోవడంపై భారత నేవీ దృష్టి పెట్టింది. దీనికోసం 76 నావల్ యుటిలిటీ హెలికాప్టర్లు (ఎన్‌హెచ్‌యూ) కొనుగోలు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 'సమాచారం కోసం అభ్యర్థన' (రిక్వెస్ట్ ఫర్ ఇన్ఫర్మేషన్)ను జారీ చేసింది. నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచిన వివరాల ప్రకారం ఈ 76 హెలికాప్టర్లలో 51 నావికా దళానికి, మిగిలిన 25 హెలికాప్టర్లను కోస్ట్‌గార్డ్‌కు కేటాయించనున్నారు.

# శత్రువులపై ఆత్మాహుతిదాడులకు మిగ్-21 విమానాలు

**డీకమిషన్ చేస్తున్న మిగ్-21లను కమికాజే డ్రోన్లుగా మార్చే యోచన?**

**టార్గెట్ డ్రోన్లుగా.. శత్రు రేడార్లను మభ్యపెట్టే విమానాలుగా వాడకం!**

**గూఢచర్యానికి ఉపయోగించే ప్రతిపాదనలపై విస్తృత చర్చ**

**న్యూఢిల్లీ :** భారత వైమానిక దళానికి దాదాపు ఆరు దశాబ్దాలపాటు సేవలందించిన యుద్ధ విమానాలు.. ఎగిరే శవపేటికలుగా పేరొందిన మిగ్ 21లకు ఈ ఏడాది సెప్టెంబరుకల్లా పూర్తిగా సెలవు ప్రకటించాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే! వాటి స్థానాన్ని స్వదేశీ తేజస్ ఎల్‌సీఏ మార్క్-1ఏ విమానాలతో భర్తీ చేసేందుకు ఐఏఎఫ్ సిద్ధమైంది. అయితే.. మిగ్-21లకు పూర్తిగా వీడ్కోలు పలకడం వల్ల వాయుసేనకు యుద్ధవిమానాల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో.. డీకమిషన్ చేసిన మిగ్ 21లను ఆత్మాహుతి డ్రోన్లుగా, శత్రు రేడార్లను మభ్యపెట్టే విమానాలుగా.. గూఢచర్యానికి.. ఇలా ఇతరత్రా రకరకాల మార్గాల్లో వినియోగించుకునే ప్రతిపాదనలపై చర్చలు జరుగుతున్నట్టు సమాచారం.

టార్గెట్ డ్రోన్లు: పైలట్ రహిత మిగ్-21లను ఏరియల్ టార్గెట్లుగా వినియోగించడం. అంటే.. ఎయిర్-టు-ఎయిర్, సర్ఫేస-టు-ఎయిర్ మిస్సైళ్లను పరీక్షించడానికి హైస్పీడ్ టార్గెట్లు అవసరం అవుతాయి. అలాంటి టార్గెట్లుగా మానవరహిత మిగ్-21లను ఉపయోగించాలనే ప్రతిపాదన ఇది. ఒక్కమాటలో చెప్పాలంటే.. మన క్షిపణుల సామర్థ్యాన్ని పరీక్షించుకునేందుకు ఈ మిగ్-21లు ప్రాక్టీసగా ఉపయోగపడతాయన్నమాట.

కంబాట్ డ్రోన్లు: మిగ్-21 బైసన్‌లను 'కంబాట్ ఎయిర్ టీమింగ్ సిస్టమ్ (క్యాట్స్)' ప్రోగ్రామ్ కింద కంబాట్ డ్రోన్లుగా మార్చడం. ఇవి మానవ రహిత యుద్ధవిమానాలుగా పనిచేస్తాయి. హైరిస్క్ మిషన్స్‌లో వీటిని ముందుగా పంపి.. శత్రు రేడార్లు, క్షిపణి రక్షణ వ్యవస్థలు యాక్టివేట్ అయ్యేలా చేస్తారు. ఆ తర్వాత మన యుద్ధవిమానాలు దాడులు చేసి ఆయా రేడార్లు, క్షిపణి రక్షణ వ్యవస్థలను నాశనం చేస్తాయి. అమెరికా ఇప్పటికే పాత ఎఫ్-16లను క్యూఎఫ-16టార్గెట్ డ్రోన్లుగా మార్చి వాడుతోంది. చైనా, రష్యా కూడా పాత యుద్ధవిమానాలను ఇదే తరహాలో వినియోగిస్తున్నట్లు సమాచారం. కమ్యూనికేషన్ రిలే టవర్: శత్రుస్థావరాలు ఉండే ప్రాంతాల్లో సురక్షిత కమ్యూనికేషన్ కోసం.. మిగ్-21లను ఎగిరే సమాచార ప్రసార టవర్లుగా ఉపయోగించుకునే ప్రతిపాదన ఇది కమికాజే స్ట్రైక్ రోల్: మానవ రహిత మిగ్-21లో భారీగా పేలుడు పదార్థాలు నింపి ఆత్మాహుతి డ్రోన్‌గా మార్చి నేరుగా శత్రులక్ష్యాలపై ప్రయోగించడం. అంటే.. ఈ విధానంలో ప్రయోగించిన విమానం ఇక తిరిగి రాదు. దాడి చేసి పేలిపోతుంది. శత్రువుల రేడార్ కేంద్రాలు, క్షిపణి రక్షణ వ్యవస్థలు, రన్‌వేలపై వీటిని ప్రయోగిస్తారు. దీనివల్ల మనం కోల్పోయేది.. కాలంచెల్లిన పాత మిగ్ విమానాలను మాత్రమే.

గూఢచర్యానికి: మిగ్-21లకు అత్యంత అధునాతనమైన సెన్సర్లను అమర్చి అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో గూఢచర్యానికి పంపొచ్చు. పగలు, రాత్రి శత్రువుల కదలికలను గమనించడానికి.. మేఘాలు, పొగమంచు ఉన్నప్పుడు కూడా భూభాగాన్ని మ్యాప్ చేయడానికి, శత్రువుల సమాచారప్రసారాన్ని పసిగట్టడానికి, శత్రువుల ఎలక్ట్రానిక్ వ్యవస్థలు ఎక్కడున్నాయో గుర్తించడానికి ఉపయోగించవచ్చు. ప్రస్తుతం మనం హెరాన్, రుస్తుం-2 వంటి యూఏవీలను గూఢచర్యానికి వాడుతున్నాం. కానీ.. మిగ్-21లు వేగంలో వాటికన్నా చాలా మెరుగైనవి. ఎక్కువ పేలోడ్‌ను మోసుకెళ్లగలవు. స్టెల్త్ సామర్థ్యం లేకపోయినా.. వేగంతో తప్పించుకోగలవు.

**అందుకే ఆ పేరు**

1963లో తొలిసారి భారత వైమానిక దళం అమ్ములపొదిలో చేరిన మిగ్-21లు దరిమిలా పలు యుద్ధాల్లో సత్తా చాటాయి. ఒక దశలో ఐఏఎఫ్ వద్ద 850కి పైగా మిగ్-21లు ఉన్నాయి. కానీ, ఈ విమానాలు తరచూ కూలిపోవడం వల్ల దాదాపు 200 మంది పైలట్లు చనిపోయారు. పలువురు పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారు. భారత వాయుసేన విమానాల్లో అత్యధికంగా కూలిపోయినవి ఇవే అందుకే వీటికి ఎగిరే శవపేటికలనే పేరు వచ్చింది.

**నాలుగు ఎఫ్-86లు వర్సెస్ మిగ్-21**

మిగ్-21లకు 'ఎగిరే శవపేటికలు', 'విడో మేకర్స్' అనే పేర్లున్నాయిగానీ.. తామెప్పుడూ వాటిని అలా చూడలేదని, వాటి సామర్థ్యం ఏమిటో తమకు తెలుసని ఎయిర్ మార్షల్ (రిటైర్డ్) పృథ్వీసింగ్ బ్రార్ (86) వంటివారు చెబుతున్నారు. 1971 యుద్ధ సమయంలో పాకిస్థాన్ ఎయిర్‌బేసలపై బాంబుల వర్షం కురిపించడంలో మిగ్-21లదే కీలకపాత్ర అని ఆయన గుర్తుచేశారు. అప్పట్లో తాను స్వయంగా మిగ్-21లో వెళ్లి పాకిస్థాన్‌లోని రఫికుల్ ఎయిర్‌బేసపై 500 కిలోల బాంబులు రెండింటిని జారవిడిచి.. తిరిగి వస్తుండగా అమెరికాకు చెందిన నాలుగు ఎఫ్-86లు తనను వెంబడించాయని చెప్పారు. "నా మిగ్-21ను పూర్తివేగంతో నడిపాను. దీంతో పాక్ విమానాలు (మిగ్-21 వేగంతో సరితూగలేక) నన్ను వదిలేశాయి" అని ఆయన వివరించారు.

# ప్రజాస్వామ్య చోదక శక్తి పార్లమెంటు

**చట్ట సభలు ప్రతిష్ఠను కోల్పోయినప్పుడల్లా విపరిణామాలు**

**అక్కడ రూపుదిద్దుకునే సరైన విధానాలే దేశాన్ని సన్మార్గంలో నడిపిస్తాయి**

**స్పీకర్ల సమావేశంలో అమిత్ షా**



**న్యూఢిల్లీ :** ప్రజాస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లే చోదక శక్తి పార్లమెంటేనని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. చట్ట సభలో రూపుదిద్దుకునే సరైన విధానాలే మన దేశాన్ని సన్మార్గంలో నడిపిస్తాయని తెలిపారు. చట్టసభలు రాజకీయ ప్రయోజనాల కోసం కాదని, ప్రజల సమస్యలను లేవనెత్తడానికి సభ నిష్పక్షపాత వేదిక కావాలని అన్నారు. కేంద్ర శాసన సభ మొదటి స్పీకర్‌గా విఠల్‌భాయ్ పటేల్ ఎన్నికై వందేళ్లు పూర్తయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ఢిల్లీ అసెంబ్లీలో రెండు రోజులపాటు జరిగే అఖిల భారత స్పీకర్ల సమావేశాన్ని ఆదివారం అమిత్ షా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సభతో పాటు స్పీకర్ గౌరవాన్ని పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. నిబంధనల ప్రకారం సభ జరిగేలా చూసుకోవాల్సిన బాధ్యత స్పీకర్లు, చైర్మన్లతోపాటు ప్రతి సభ్యుడిపై ఉందన్నారు. 13 వేల ఏళ్ల భారత దేశ చరిత్రలో చట్ట సభలు గౌరవాన్ని కోల్పోయినప్పుడల్లా మనం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవలసి వచ్చిందని అమిత్ షా అన్నారు. శాసన సభలు సరిగా పనిచేయకపోతే ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు ఉత్పన్నమవుతాయని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. ఈ స్పీకర్ల సమావేశం ఉత్తమ పద్ధతులను నేర్చుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ సమావేశంలో ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వి.కె. సక్సేనా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా, దేశంలోని 29 రాష్ట్రాల అసెంబ్లీ స్పీకర్లు, 17 మంది డిప్యూటీ స్పీకర్లు, ఆరు రాష్ట్రాల శాసన మండలి చైర్మన్లు, డిప్యూటీ చైర్మన్లు.. కేంద్ర, ఢిల్లీ మంత్రులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. తెలంగాణ నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్, ఏపీ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షాను గడ్డం ప్రసాద్ శాలువాతో సత్కరించారు. కాగా, శాసన సభల పనిదినాలు పెరగాల్సిన అవసరం ఉందని ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు అభిప్రాయ పడ్డారు. "అసెంబ్లీల్లో నిజమైన ప్రజాస్వామ్యం ఉందా..? అన్న కీలక ప్రశ్నను మనం ఎదుర్కొంటున్నాం. తొలి పార్లమెంట్ సుమారు 135 రోజులు నడిచింది. నేను 17వ లోక్‌సభ సభ్యుడిగా ఉన్నాను. ఈ సభ పని దినాలు ఏడాదికి 55 రోజులకు పడిపోయాయి. ఇక్కడ కొంతమందితో మాట్లాడినప్పుడు తమ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు 30 నుంచి 40 రోజులు నడుస్తున్నాయని చెప్పారు. దీనిపై మనం ఎంతో ఆలోచించాల్సిన అవసరం ఉంది. సభలు ఇలాగే నడిస్తే ప్రజా సమస్యలపై చర్చించడం కష్టమే కదా..? అందుకే.. పనిదినాలు పెరగాల్సిన అవసరం ఉంది. 180 రోజులకు తక్కువ కాకుండా సభ నడవాలని రాజ్యాంగం చెబుతోంది. తొలి పార్లమెంట్‌ను సభాపతి 180 రోజులు నిర్వహించిన తీరును మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలి" అని రఘురామ తెలిపారు.

# అంతరిక్షంలోకి వెళ్తాననుకోలేదు



**న్యూఢిల్లీ :** బాల్యంలో తాను చాలా బిడియస్థుడినని, ఎవరితోనూ కలిసేవాడిని కాదని భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా తెలిపారు. అంతరిక్షంలోకి వెళ్తానని కలలో కూడా అనుకోలేదని చెప్పారు. ఆదివారం భారత వైమానిక దళం (ఐఏఎఫ్) నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నతనంలో రాకేశ్‌శర్మ అంతరిక్ష ప్రయాణానికి సంబంధించిన కథలు వింటూ పెరిగానని గుర్తుచేసుకున్నారు. అయితే అప్పట్లో నింగిలోకి వెళ్లాలనే ఆలోచన లేదన్నారు. మరోవైపు, గగన్‌యాన్ వ్యోమగాములు శుభాన్షు శుక్లా, పి.వి. నాయర్, అజిత్ కృష్ణన్, అంగద్ ప్రతాపను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సన్మానించారు. అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ఆకాంక్షలకు ప్రతీకలుగా నిలిచిన వీరు మన దేశానికి గర్వకారణమని ప్రశంసించారు. "నాది లఖ్‌నవూ పార్లమెంట్ నియోజకవర్గం. శుభాన్షు శుక్లా అక్కడివాడే. అతను కూడా మా ఓటరు" అని రాజ్‌నాథ్ అన్నారు.

# వినియోగదారుల ఫోరమ్‌ల అధికారాల పునరుద్ధరణ

**అన్ని రకాల ఆదేశాలను అమలు చేసేలా సుప్రీంకోర్టు తీర్పు**

**న్యూఢిల్లీ :** వినియోగదారుల ఫోరమ్‌ల అధికారాలను పునరుద్ధరిస్తూ సుప్రీంకోర్టు తాజాగా కీలక తీర్పు వెలువరించింది. వాటి అన్ని తుది, మధ్యంతర ఆదేశాలను సివిల్ కోర్టు డిక్రీలుగా పరిగణిస్తూ అమలు చేసే అధికారాన్ని కల్పిస్తూ జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ రాజేశ్ బిందాల్ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిర్ణయం వేలాది మంది వినియోగదారులకు అనుకూలమైన తీర్పులు వచ్చినప్పటికీ.. నిజమైన ఉపశమనం లభించని దాదాపు 18 ఏళ్ల చట్టపరమైన లొసుగుకు ముగింపు పలికింది. 'ప్రతి ఆర్డర్' అనే పదం స్థానంలో 'మధ్యంతర ఆర్డర్' అని మారుస్తూ వినియోగదారుల పరిరక్షణ చట్టానికి (సీపీఏ) 2002లో చేసిన సవరణ.. ఫోరమ్‌ల అధికారాలను నీరుగార్చిందని ధర్మాసనం అభిప్రాయపడింది. వాటి సొంత తుది తీర్పులను కూడా అమలు చేయకుండా నిరోధించిందని పేర్కొంది. 1986 చట్టంలోని సెక్షన్ 25 'ఏ ఆదేశాన్ని' అయినా అమలు చేసే అధికారాన్ని ఫోరమ్‌లకు కల్పిస్తుందని పేర్కొంది.

# బిహార్‌లో ఓట్ల చోరీని అడ్డుకుంటాం

**ఎస్‌ఐఆర్ రాజ్యాంగ విరుద్ధం**

**ఓటర్ అధికార్ యాత్రలో రాహుల్‌గాంధీ**

**పెళ్లి గురించి రాహుల్ ఆసక్తికర వ్యాఖ్యలు**

**రాహుల్ గాంధీకి కౌగలించుకుని ముద్దుపెట్టిన ఆగంతకుడు**



**పట్నా:** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ పేరిట బిహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వం పేదల ఓట్ల చోరీకి పాల్పడుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. 'ఓటర్ అధికార్ యాత్ర'లో భాగంగా ఎనిమిదో రోజు ఆదివారం పూర్ణియా జిల్లా ఆరాలో ఆర్జేడీ ముఖ్యనేత తేజస్వీ యాదవ్‌తో కలిసి రాహుల్‌గాంధీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సంఘం సహకారంతో మోదీ ప్రభుత్వం ఓట్ల అక్రమాలకు పాల్పడుతోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ బిహార్ లోని పూర్ణియా జిల్లాలోని అరారియా వీధుల గుండా మోటారు సైకిల్ నడిపారు. వీరిని చూడటానికి జనం భారీ సంఖ్యలో బారులు తీరారు. ఆగస్టు 17న రాహుల్ గాంధీ ప్రారంభమైన ఓటర్ అధికార్ యాత్ర, 1300 కిలోమీటర్ల మేర కొనసాగనుంది. ఈ యాత్ర 16 రోజుల పాటు 20 జిల్లాలకు పైగా కొనసాగి, సెప్టెంబర్ 1న పట్నాలో నిర్వహించే భారీ సభతో ముగియనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో, పెళ్లి గురించి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆర్‌జేడీ అగ్రనేత తేజస్వి యాదవ్ మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. ఈక్రమంలో తన పెళ్లి గురించి రాహుల్ కీలక వ్యాఖ్యలు చేశారు. "బిహార్‌లో ఆర్‌జేడీపైనే ఆధారపడి జాతీయ పార్టీ కాంగ్రెస్ బతుకుతోందని కేంద్ర మంత్రి, ఎల్‌జేపీ చీఫ్ చిరాగ్ పాశ్వాన్ విమర్శిస్తున్నారు. దానిపై ఏమంటారు?" అని విలేకరి అడిగిన ప్రశ్నకు తేజస్వి బదులిస్తూ, చిరాగ్ తనకు పెద్దన్న లాంటి వారన్నారు. త్వరగా పెళ్లి చేసుకోవాలనే సూచన చేయడం తప్ప, చిరాగ్‌పై విమర్శలను చేయలేనని చెప్పారు. చిరాగ్ పెళ్లి చేసుకోవడం ఇప్పటికే చాలా లేటైందన్నారు. "రాముడికి హనుమంతుడు ఎలాంటి విధేయతను చూపించాడో, ప్రధాని మోదీతో తాను అలాంటి విధేయతతోనే నడుచుకుంటానని గతంలో చిరాగ్ చెప్పుకున్నారు. అలాంటి హాస్యాస్పద కామెంట్స్‌పై నేను విమర్శలు చేయగలను. కానీ చేయను" అని తేజస్వి తేల్చి చెప్పారు. వేదికపైనే కూర్చొని ఉన్న రాహుల్‌గాంధీ వెంటనే చేతిలోకి మైక్ తీసుకొని మాట్లాడారు. "తేజస్వి యాదవ్ చేసిన సూచన నాకు కూడా వర్తిస్తుంది. తేజస్వి వాళ్ల నాన్న (లాలూప్రసాద్ యాదవ్) సైతం చాలా కాలంగా నాకు ఇదే సూచన చేస్తున్నారు" అని రాహుల్ చెప్పారు. దీంతో అక్కడున్న వాళ్లందరి మొహాల్లో చిరునవ్వులు విరబూశాయి. మరోవైపు 'ఓటర్ అధికార్ యాత్ర' వేళ షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. ఓ గుర్తు తెలియని వ్యక్తి అకస్మాత్తుగా దూసుకొచ్చి రాహుల్‌గాంధీని గట్టిగా కౌగిలించుకొని, భుజంపై ముద్దు పెట్టాడు. పూర్నియా నుంచి అరారియా వైపుగా రాహుల్ గాంధీ బైక్‌పై యాత్రగా వస్తుండగా ఈ ఘటన జరిగింది. బైక్‌ను రాహుల్ మెల్లగా నడుపుతుండగా, ఓ వ్యక్తి దూసుకొచ్చి ఆయన్ను కౌగిలించుకున్నాడు. దీంతో బైక్‌ను బ్యాలెన్స్ చేయడంలో రాహుల్ కొంత తడబాటుకు గురయ్యారు. దీన్ని గుర్తించిన భద్రతా సిబ్బంది వెంటనే ఆ వ్యక్తిని పక్కకు ఈడ్చేసి, చెంపదెబ్బ కొట్టారు. రాహుల్ గాంధీ మాత్రం చిరునవ్వులు చిందిస్తూ బైక్‌ను నడుపుతూ ముందుకు సాగారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
25 ఆగస్టు
2025







# ఉదయం గుండెపోటు ప్రమాదాలు ఎక్కువ..

## ఎందుకో తెలుసా?

మనం ఉదయం లేవగానే రోజుని ఎలా మొదలు పెడతామో, అది మన గుండె ఆరోగ్యాన్ని అంతగా ప్రభావితం చేస్తుందని మీకు తెలుసా? దీని గురించి ప్రపంచ ఆరోగ్య సంస్థ సంచలన విషయాలను ప్రకటించింది. దీని ప్రకారం 2022లో దాదాపు 19.8 మిలియన్ల మంది గుండె సంబంధిత వ్యాధుల కారణంగా మరణించారు.

ఇది ప్రపంచవ్యాప్తంగా మరణాలలో దాదాపు 32% వాటా. వీటిలో 85% మరణాలు గుండెపోటు, స్ట్రోక్ వల్ల సంభవించాయి. అంటే గుండెకు రక్తం, ఆక్సిజన్‌ను సరఫరా చేసే ధమనిలో అడ్డంకి ఏర్పడినప్పుడు గుండెపోటు వస్తుంది. కానీ, ఈ ప్రమాదం ఉదయం సమయంలో ఎక్కువగా ఉందని తేలింది.

**ఉదయం ఎందుకు**

దీనికి సంబంధించి ప్రముఖ గుండె వైద్య నిపుణుడు, ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ విషయంపై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. ఆయన చెప్పిన ప్రకారం, ఉదయం సమయం మన గుండెకు చాలా సున్నితమైన సమయమన్నారు. ఎందుకంటే, మనం నిద్ర లేవగానే శరీరంలో కొన్ని సహజమైన మార్పులు జరుగుతాయి. ఈ మార్పులు గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయని చెప్పారు.

ఉదయం లేవగానే, శరీరంలో కార్టిసాల్ (స్ట్రెస్ హార్మోన్) స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతాయి. రక్తంలోని ప్లేట్‌లెట్స్ (రక్తం గడ్డకట్టే కణాలు) జిగురుగా మారతాయి. రక్తపోటు కూడా పెరుగుతుంది. ఈ మూడు అంశాలు ఉదయం సమయంలో ఆకస్మిక గుండె వచ్చే ప్రమాదాన్ని పెంచుతాయన్నారు.

**ఉదయం 7 నుంచి 11 గంటల మధ్య**

ఓ ప్రముఖ అధ్యయనం ప్రకారం, గుండెపోటు, ఆకస్మిక గుండె ఆగిపోయే సంఘటనలు ఉదయం 7 నుంచి 11 గంటల మధ్య ఎక్కువగా సంభవిస్తాయి. అలాగే, సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య కూడా కొంత ప్రమాదం ఉంటుంది. కానీ ఉదయం సమయం ఎక్కువ ప్రమాదకరం. ఎందుకంటే, మనం నిద్ర లేవగానే శరీరం ఒక్కసారిగా చురుకుగా మారుతుంది. ఒక్కసారిగా శారీరక లేదా మానసిక ఒత్తిడి పెరిగితే, గుండెపై భారం పడుతుందని వైద్యులు చెబుతున్నారు.

**ఇలా చేయడం వల్ల..**

మార్నింగ్ లేవగానే కాఫీ తాగడం, నీళ్లు తాగకుండా ఉండటం, మందులు సకాలంలో వేసుకోక పోవడం లేదా పనిలో నిమగ్నం కావడం వంటివి కూడా గుండెపై ఒత్తిడిని పెంచుతాయన్నారు. లేవగానే ఒక గ్లాసు నీళ్లు తాగడం వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. ఇది రక్తప్రవాహాన్ని సాఫీగా ఉంచడంలో సహాయపడుతుంది.

ఉదయం ఖాళీ కడుపుతో కాఫీ లేదా టీ తాగడం మానేసి, ప్రోటీన్ ఎక్కువగా ఉండే గుడ్లు, పప్పు గింజలు తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. చాలామంది గుండెపోటు ఒత్తిడి వల్లే వస్తుందని అనుకుంటారు. కానీ, ఒత్తిడి ఒక కారణం అయినప్పటికీ, ఉదయం మనం ఎలా రోజుని మొదలు పెడతామనే దానిపై గుండె ఆరోగ్యం ఎక్కువగా ఆధారపడుతుందన్నారు నిపుణులు.

# అసలు జంక్ ఫుడ్ అంటే ఏమిటి..?

## దీన్ని తింటే ఎలాంటి దుష్పరిణామాలు కలుగుతాయి..?




సాయంత్రం అయిందంటే చాలు.. చాలా మంది జంక్ ఫుడ్ తినేందుకు ఆసక్తిని చూపిస్తుంటారు. వేడి వేడిగా నూనెలో వేయించి తీసే పకోడీలు, పునుగులు, బజ్జీల వంటి వాటితోపాటు పిజ్జాలు, బర్గర్స్, చాట్, చిప్స్ వంటివి తినేందుకు ఇష్టపడుతుంటారు. సాయంత్రం సమయంలో సహజంగానే చాలా మందికి కాస్త ఆకలిగా అనిపిస్తుంది. దీంతో జంక్ ఫుడ్‌ను తిని పొట్ట నింపుకుంటారు. అయితే వాస్తవానికి ఇలా జంక్ ఫుడ్‌ను తరచూ తినడం అసలు ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని వైద్యులు చెబుతున్నారు. జంక్ ఫుడ్ అంటే.. అత్యధికంగా ప్రాసెస్ చేయబడిన ఆహారాలు అని అర్థం. ఇవి క్యాలరీలను అధికంగా ఇస్తాయి. పోషకాలు అసలు ఏమాత్రం ఉండవు. విటమిన్లు, మినరల్స్, ఫైబర్ వంటి పోషకాలు ఈ పదార్థాల్లో ఉండవు.

**తీవ్రమైన అలసట, నీరసం..**

జంక్ ఫుడ్ అంటే యువతకు పిజ్జాలు, బర్గలు, ఫ్రెంచ్ ఫ్రైస్, చిప్స్, శీతల పానీయాలు, చాక్లెట్లు, కేకులు గుర్తుకు వస్తాయి. కానీ బజ్జీలు, సమోసాలు వంటివి కూడా జంక్ ఫుడ్ కిందకే వస్తాయి. అవేమో విదేశీ జంక్ ఫుడ్, ఇవి స్వదేశీ జంక్ ఫుడ్ అన్నమాట. వాటికి, వీటికి పెద్ద తేడా ఉండదు. వేటిని తిన్నా కూడా ఆరోగ్యానికి హానికరమే. జంక్ ఫుడ్ వాస్తవానికి చాలా రుచిగా ఉంటుంది. కనుకనే చాలా మంది ఆ రుచికి దాసోహం అంటారు. తిన్న కొద్దీ తినాలపిస్తుంది. అందుకు కారణం వాటిల్లో వాడే పదార్థాలే అని చెప్పవచ్చు. వాటి వల్ల ఆరోగ్యంపై తీవ్ర దుష్పరిణామాలు ఏర్పడుతాయి. జంక్ ఫుడ్‌లో రిఫైన్ చేయబడిన పిండి పదార్థాలు, చక్కెరలు అధికంగా ఉంటాయి. ఇవి షుగర్ లెవల్స్‌ను అమాంతం పెంచేస్తాయి. దీని వల్ల కణాలకు త్వరగా గ్లూకోజ్ లభించదు. దీర్ఘకాలంలో ఇది డయాబెటిస్‌కు దారి తీస్తుంది. తీవ్రమైన అలసట, నీరసం, బద్దకం కూడా ఉంటాయి. అందుకనే కొందరు జంక్ ఫుడ్ తిన్న వెంటనే బద్దకంగా కనిపిస్తారు.

**జీర్ణ సమస్యలు..**

జంక్ ఫుడ్‌లో ఫైబర్ అసలే ఉండదు. ఉన్నా చాలా తక్కువ మొత్తంలో ఉంటుంది. అందువల్ల అలాంటి ఫుడ్స్‌ను తింటే జీర్ణ వ్యవస్థపై ప్రభావం పడుతుంది. దీంతో కడుపు ఉబ్బరం, గ్యాస్, మలబద్దకం వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. జంక్ ఫుడ్‌లో కొవ్వులు అత్యధిక స్థాయిలో ఉంటాయి. ఇవి జీర్ణం అయ్యేందుకు చాలా సమయం పడుతుంది. దీంతో అజీర్తి వస్తుంది. పైగా ఈ కొవ్వులు శరీరంలో అధికంగా చేరితే క్యాలరీలు చేరి బరువు పెరుగుతారు. జంక్ ఫుడ్‌ను తినడం వల్ల రక్తంలో షుగర్ స్థాయిలు అసాధారణ రీతిలో ఉంటాయి. దీంతో అది మూడ్‌పై కూడా ప్రభావం చూపిస్తుంది. ఏకాగ్రత దెబ్బ తింటుంది. ఏ పనిపై దృష్టి పెట్టలేకపోతారు. జ్ఞాపకశక్తి సైతం నశిస్తుంది. అధ్యయనాలు చెబుతున్న ప్రకారం జంక్ ఫుడ్‌ను తినడం వల్ల తీవ్రమైన డిప్రెషన్, ఆందోళన బారిన పడతారని తేలింది. ఇది మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది.

**డయాబెటిస్, హార్ట్ ఎటాక్..**

జంక్ ఫుడ్‌ను తింటే వాటిల్లో ఉండే చక్కెర, పిండి పదార్థాల కారణంగా రక్తంలో ఇన్సులిన్ స్థాయిలు అమాంతం పెరుగుతాయి. దీంతో హార్మోన్లలో తీవ్రమైన మార్పులు వస్తాయి. ఇది శరీరంలో అంతర్గతంగా వాపులకు దారి తీస్తుంది. మొటిమలకు సైతం కారణమవుతుంది. మీకు సడెన్‌గా మొటిమలు వస్తున్నాయంటే మీరు జంక్ ఫుడ్‌ను అధికంగా తింటున్నారేమో చెక్ చేసుకోండి. ఈ ఫుడ్‌ను ఎక్కువగా తింటుంటే ఆ అలవాటును మానే ప్రయత్నం చేయండి. దీంతో మొటిమలు వాటంతట అవే తగ్గిపోతాయి. అలాగే జంక్ ఫుడ్‌ను తరచూ అధికంగా తినడం వల్ల బరువు పెరిగి టైప్ 2 డయాబెటిస్ బారిన పడే అవకాశాలు ఉంటాయి. ఈ ఫుడ్‌లో సోడియం అధికంగా ఉంటుంది కనుక ఇది కిడ్నీలపై ప్రభావం చూపిస్తుంది. దీంతో దీర్ఘకాలంలో కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. అలాగే కొలెస్ట్రాల్ లెవల్స్ అధికంగా చేరి రక్తనాళాల్లో అడ్డంకులు ఏర్పడుతాయి. ఇది గుండె పోటుకు కారణమవుతుంది. కనుక జంక్ ఫుడ్‌ను తింటున్నవారు ఇప్పటికైనా ఆ ఆహారాలను తినడం తగ్గించాలి. లేదంటే తీవ్ర దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

# మొలకెత్తిన గింజల్ని పచ్చిగా తింటే మేలా? ఉడక బెట్టి తింటే మేలా?

మొలకెత్తిన గింజల్ని తినటం వల్ల చాలా రకాల ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మనందరికీ తెలుసు. మొలకెత్తిన గింజల్లో ప్రోటీన్, ఫైబర్ కంటెంట్ చాలా ఎక్కువగా ఉంటుంది. చాలా మంది ఉదయం బ్రేక్ ఫాస్ట్‌గా కేవలం మొలకెత్తిన గింజల్ని మాత్రమే తింటూ ఉంటారు. అయితే, వర్షాకాలంలో మాత్రం పచ్చిగా ఏవి తిన్నా ఆరోగ్యానికి నష్టమే. మరీ ముఖ్యంగా మొలకెత్తిన గింజల్ని పచ్చిగా తింటే రోగాల్ని కొనితెచ్చుకున్నట్లే. ఎందుకంటే.. బ్యాక్టీరియాతో పాటు ఇతర క్రిములు ఎక్కువ మొత్తంలో ఉంటాయి. నేరుగా వాటిని తీసుకోవటం వల్ల రోగాలు వచ్చే అవకాశం ఉంది. ఎలా తింటే మంచిదో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

**ఉడకబెట్టి తినటం వల్ల..**



వర్షాకాలంలో జీర్ణ వ్యవస్థ చాలా బలహీనంగా ఉంటుంది. ఏ చిన్న సమస్యను కూడా జీర్ణ వ్యవస్థ తట్టుకోలేదు. రోగాలు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. అందుకే మొలకెత్తిన గింజల్ని తగిన మోతాదులో ఉడకబెట్టుకోవాలి. అలా చేస్తే నమలడానికి, అరిగించుకోవడానికి సరిగ్గా సరిపోతాయి. తరచుగా జీర్ణ సంబంధ సమస్యలతో బాధపడేవారికి ఇది మంచి ఛాయిస్. అంతేకాదు.. ఉడకబెట్టిన వాటిని తినటం వల్ల అందులోని బ్యాక్టీరియా, ఇతర క్రిమి కీటకాలు చనిపోతాయి. బయో అవాలబిటీ పెరుగుతుంది. మిటమిన్స్, మినరల్స్‌ను శరీరం సులభంగా గ్రహించడానికి అవకాశం ఉంటుంది. ఉడకబెట్టి తినటం వల్ల లాభాలతో పాటు కొంత నష్టం కూడా ఉంది. మొలకెత్తిన గింజల్లోని పోషక విలువలు కొంత మేర తగ్గిపోతాయి.


**పచ్చిగా తినటం వల్ల..**


ఉడకబెట్టి తినటం కంటే .. పచ్చిగా తింటేనే కొంతమందికి నచ్చుతుంది. మంచి టేస్ట్ కూడా ఉంటుంది. ఫ్రెష్ వాటిని తినటం వల్ల జీర్ణక్రియకు దోహదపడే లైవ్ ఎంజైమ్స్ పెద్ద మొత్తంలో శరీరానికి అందుతాయి. జీవక్రియ కూడా మెరుగుపడుతుంది. పచ్చి వాటిలో విటమిన్ సీ, విటమిన్ కే, పొటాషియం, మెగ్నీషియం అధికమొత్తంలో ఉంటాయి. పచ్చి మొలకెత్తిన గింజల్లో తక్కువ క్యాలరీలు ఉంటాయి. లావు తగ్గాలనుకునే వారికి ఇవి బెస్ట్ ఛాయిస్. ఇదంతా నాణానికి ఓ వైపు మాత్రమే. రెండో వైపు మన ఆరోగ్యం దెబ్బ తీసే విషయాలు చాలా ఉన్నాయి. పచ్చి మొలకెత్తిన గింజల్లో ప్రమాదకరమైన బ్యాక్టీరియాలు ఉంటాయి. ఈ కోలీ, సాల్మోనెల్లా వంటి బ్యాక్టీరియా వాటిలో ఉంటాయి. పచ్చి వాటిని తింటే ఫుడ్ పాయిజనింగ్ అయ్యే అవకాశాలు ఎక్కువ. చిన్న పిల్లలు, గర్భిణులు, ముసలి వాళ్లు, వ్యాధి నిరోధక శక్తి సరిగా లేని వాళ్లకు ఇది మంచి ఛాయిస్ కాదు. బాగా కడిగినా కూడా అందులోని చాలా రకాల క్రిములు చనిపోవు.

# ఇమ్యూనిటీ పవర్ పెంచే సీక్రెట్ టిప్స్..


## రోజుకు 5 నిమిషాలు చాలు!

శ్వాసక్రియ అనేది కేవలం శరీరానికి ఆక్సిజన్ సరఫరా చేసే వ్యవస్థ మాత్రమే కాదు. శరీరం, మనస్సు, ఆత్మను శక్తివంతం చేసే ఒక యోగం. ఆయుర్వేదం ప్రకారం, స్పృహతో శ్వాస తీసుకోవడం లేదా ప్రాణాయామం చేస్తే రోగనిరోధక శక్తి బలోపేతమవుతుంది. మానసిక, శారీరక శ్రేయస్సుకు ఇది చాలా ముఖ్యమైనది. ప్రతిరోజూ క్రమబద్ధమైన శ్వాస వ్యాయామాలు చేస్తే మనస్సు తేలికపడటమే కాకుండా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇవి ఒక కవచంలా శరీరాన్ని వ్యాధుల నుంచి సంరక్షిస్తాయి. ఒత్తిడి, కాలుష్యం, జీవనశైలి సంబంధిత రుగ్మతలను రోగనిరోధక శక్తిని బలహీనపరిచే ఈ ప్రపంచంలో.. రోజుకు కనీసం 5-10 నిమిషాలు ప్రాణాయామం చేస్తే లెక్కలేనన్ని ప్రయోజనాలు..









**ప్రాణాయామం**

ఆయుర్వేదం శ్వాసను ప్రాణ శక్తిగా నిర్వచిస్తుంది. ఈ కదలికలో అడ్డంకులు ఉంటే రోగనిరోధక శక్తిని బలహీనపడుతుంది. జీర్ణక్రియకు అంతరాయం కలుగుతుంది. మానసిక సమతుల్యతను ప్రభావితమవుతుంది. అందువల్ల అనులోమ్ విలోమ్ వంటి పద్ధతులు శక్తి మార్గాలను శుద్ధి చేస్తాయి. దోషాలను సమతుల్యం చేస్తాయి. రక్తంలోకి ఆక్సిజన్ సరఫరాను పెంచుతాయి. క్రమం తప్పకుండా ప్రాణాయామం చేయడం వల్ల శోషరస ప్రవాహాన్ని పెరిగి శరీరం విషాన్ని సమర్థవంతంగా తొలగించడానికి వీలు కలుగుతుంది. ప్రాణాయామం చేసేందుకు ముందుగాపద్మాసనంలో కూర్చోవాలి. చేత్తో కుడి ముక్కు రంధ్రాన్ని మూసి, ఎడమ ముక్కు రంధ్రం ద్వారా గాలిని పీల్చి కొంతసేపు అలాగే ఆపి ఉంచాలి. తర్వాత కుడి ముక్కు రంధ్రం ద్వారా వదలాలి. ఆ తర్వాత ఇదే పద్ధతిని కుడి రంధ్రంతో చేయాలి.

**కపాలభాతి**

మరో శక్తివంతమైన అభ్యాసం కపాలభాతి. ఇది శ్వాస క్రియలో అడ్డంకులను తొలగిస్తుంది. జీవక్రియను పెంచుతుంది. ఉదర అవయవాలను టోన్ చేస్తుంది. జీర్ణక్రియను సక్రియం చేయడం, శ్లేష్మాన్ని వదులు చేయడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. కపాలభాతి చేయడం కోసం ముందుగా వెన్నెముక నిటారుగా ఉంచి సౌకర్యవంతమైన స్థితిలో కూర్చోవాలి. ఉదర కండరాలను ఉపయోగించి బలవంతంగా గాలిని బయటకు వదలాలి. శ్వాసను సహజంగానే తీసుకోవాలి.

**భ్రమరీ ప్రాణాయామం**

మనశ్శాంతి, మంచి నిద్ర కోసం భ్రమరీ ప్రాణాయామం (హమ్మింగ్ బీ బ్రీతింగ్) చేయాలని యోగా నిపుణులు సూచిస్తున్నారు. బలమైన రోగనిరోధక శక్తికి ఇది చాలా అవసరం. పద్మాసనంలో కూర్చుని చేతులతో కళ్ళు మూసుకుని ముక్కు ద్వారా లోతుగా గాలి పీల్చి నెమ్మదిగా వెలుపలకు వదులుతూ ఉండాలి. తేనెటీగ శబ్దం వచ్చేలా శ్వాస వదలాలి. ప్రతిరోజూ 5 -10 నిమిషాలు చేసినా గణనీయమైన తేడాను గమనించవచ్చు.

**భస్త్రికా ప్రాణాయామం**

భస్త్రికా ప్రాణాయామం సాధన చేయడం వల్ల ఊపిరితిత్తుల బలం పెరుగుతుంది. ఆక్సిజన్ సరఫరా మెరుగుపడటంతో పడుతుంది. ఈ ఆసనాన్ని క్రమం తప్పకుండా సాధన చేయడం వల్ల రోగనిరోధక వ్యవస్థ చురుగ్గా పనిచేస్తుంది. ఈ ప్రాణాయామం సాధన చేయడానికి సౌకర్యవంతమైన స్థితిలో కూర్చోవాలి. కళ్ళు మూసుకుని ముక్కు ద్వారా లోతైన శ్వాస తీసుకొని శబ్దం వచ్చేలా గాలిని వేగంగా బయటకు వదలాలి. ఇలాగే 10-15 సార్లు పునరావృతం చేస్తే చాలు.

**సేతు బంధాసనం**

వీపు మీద పడుకుని మోకాళ్ళను తింది వంచి పాదాలను నేలకు ఆనించాలి. తర్వాత చేతులను శరీరానికి దగ్గరగా చేర్చుకుని చేతులతో పాదాలను పట్టుకుని నెమ్మదిగా తుంటి భాగాన్ని పైకి లేపండి. ఊపిరి పీల్చుకుంటూ పాదాలు, భుజాలను నేలపై గట్టిగా నొక్కండి. శరీరం వంతెన ఆకారంలోకి వచ్చాక 30 సెకన్ల పాటు అదే స్థితిలో ఉండి గట్టిగా శ్వాస తీసుకుంటూ ఉండండి. ఆ తర్వాత నెమ్మదిగా వెన్నును నేలకు అన్చండి. ఈ ఆసనాన్ని సరిగ్గా సాధన చేయడం వల్ల ఊపిరితిత్తులు, థైరాయిడ్ గ్రంథులు సక్రియం అవుతాయి. శరీర శక్తి పెరుగుతుంది. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. అలాగే, రోగనిరోధక వ్యవస్థ బలపడుతుంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
25 ఆగస్టు
2025





# పుజారా వీడ్కోలు

## క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన నయా వాల్..

## అన్ని ఫార్మాట్ల నుంచి వైదొలుగుతున్నట్టు ప్రకటన

రాజ్‌కోట్ : సుమారు దశాబ్దకాలం పాటు టెస్టుల్లో భారత క్రికెట్ బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలిచిన 'నయా వాల్' ఛతేశ్వర్ పుజారా అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్టు ఆదివారం అతడు తన సోషల్ మీడియా ఖాతాల వేదికగా ప్రకటించాడు. 13 ఏండ్ల అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌లో భారత్ తరఫున 103 టెస్టులాడిన పుజారా.. 43.60 సగటుతో 7,195 పరుగులు చేశాడు. అతడి ఖాతాలో 19 శతకాలు, 35 అర్ధ శతకాలున్నాయి. 2010లో భారత క్రికెట్‌లోకి అడుగుపెట్టిన పుజ్జీ (పుజారా ముద్దుపేరు).. టెస్టుల్లో రాహుల్ ద్రవిడ్ వదిలివెళ్లిన మూడో స్థానాన్ని వందకు వందశాతం భర్తీచేసి భారత క్రికెట్ అభిమానులతో 'నయా వాల్' అనిపించుకున్నాడు. చివరిసారిగా అతడు 2023 వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్స్ (డబ్ల్యూటీసీ)లో భాగంగా టీమ్‌ఇండియా తరఫున ఆస్ట్రేలియాతో ఆఖరి మ్యాచ్ ఆడాడు. కొత్త కుర్రాళ్ల రాకతో పాటు ఫామ్‌లేమితో జట్టుకు దూరమైన ఈ సౌరాష్ట్ర దిగ్గజం.. తన చివరి మ్యాచ్ ఆడిన రెండేండ్ల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. వన్డేలలో అతడు భారత్ తరఫున ఐదు మ్యాచ్‌లు ఆడాడు.

**పోరాట యోధుడు**

భారత క్రికెట్‌లో ముఖ్యంగా టెస్టుల్లో తరానికి ఓ బ్యాటర్ టీమ్‌ఇండియాకు సైలెంట్ వారియర్స్‌లా పోరాడారు. భారత క్రికెట్ ఆరంభంలో ఆ బాధ్యతలను సునీల్ గవాస్కర్ మోస్తే ఆ తర్వాత ఆ భారాన్ని సుమారు రెండుదశాబ్దాల పాటు ద్రవిడ్ మోశాడు. మునపటితరంలో అత్యుత్తమ పేసర్లకు తనదైన డిఫెన్స్‌తో చుక్కలు చూపించిన ద్రవిడ్ రిటైర్మెంట్ తర్వాత ఆ స్థానాన్ని భర్తీ చేసేది ఎవరా? అని చూస్తుండగా నేనున్నానంటూ వచ్చాడు పుజారా. దేశవాళీలో సౌరాష్ట్ర తరఫున ఆడుతూ జాతీయ సెలక్టర్ల దృష్టిలో పడ్డ అతడు.. 2010లో బెంగళూరులో ఆస్ట్రేలియాతో టెస్టులో అరంగేట్రం చేశాడు. ద్రవిడ్ మాదిరిగానే బౌలర్లకు కొరకరాని కొయ్యగా మారుతూ ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడటంలో దిట్ట అయిన పుజారా టెస్టు అరంగేట్రం తర్వాత రెండేండ్లకు హైదరాబాద్‌లో న్యూజిలాండ్‌తో మ్యాచ్‌లో తన తొలి టెస్టు శతకాన్ని సాధించాడు. ఆ తర్వాత రెండు నెలలకే ఇంగ్లండ్‌తో అహ్మదాబాద్ టెస్టులో డబుల్ సెంచరీ బాదాడు. పేసర్లకు స్వర్గధామంగా ఉండే సౌతాఫ్రికా పిచ్‌లపై 2013లో జోహన్నస్‌బర్గ్ టెస్టులో డేల్ స్టెయిన్, మోర్నీ మోర్కెల్, వెర్నాన్ ఫిలాండర్ వంటి మేటి బౌలర్లను సమ-ర్థవంతంగా ఎదుర్కొని 153 రన్స్ చేసి మ్యాచ్‌ను కాపాడాడు. 2017లో రాంచీలో ఆసీస్‌తో ఆడిన టెస్టు అయితే అతడి కెరీర్‌లో ఓ మైలురాయి అని చెప్పక తప్పదు. ఆ టెస్టులో ఏకంగా 525 బంతులను ఎదుర్కొన్న అతడు.. 202 రన్స్ చేశాడు.

**ఆసీస్ గడ్డపై..**

ఇక ఆస్ట్రేలియాలో భారత జట్టు 2018-19, 2020-21లో




బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని గెలవడంలో పుజారాది కీలకపాత్ర. భారత జట్టు ఆసీస్ గడ్డపై తొలి సిరీస్ విజయం సాధించిన 2018-19 సిరీస్‌లో పుజారా నాలుగు టెస్టులాడి 521 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ముఖ్యంగా ఆ సిరీస్ అడిలైడ్ టెస్టులో ఆసీస్ పేస్ అటాక్‌కు భారత బ్యాటింగ్ లైనప్ చేతులెత్తేయగా పుజ్జీ మాత్రం ఒంటిచేత్తో జట్టును ఆదుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 41/4తో ఉ



న్న జట్టును 246 బంతులెదుర్కొని 123 రన్స్ చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 71 రన్స్ చేసి భారత విజయంలో కీలకపాత్ర పోషించాడు. 2021 పర్యటనలో ఆసీస్ పేసర్లు స్టార్క్, హేజిల్‌వుడ్, కమిన్స్ త్రయం.. పుజారా బాడీని టార్గెట్ చేస్తూ బంతులు సంధించినా అతడు వెరవలేదు. సిడ్నీ టెస్టును భారత్ కాపాడుకున్నా.. బ్రిస్బేన్‌లో చారిత్రత్మక విజయాన్ని సాధించినా అందులో పుజారా పాత్ర మరువలేనిది. రహానే, కోహ్లితో కలిసి చారిత్రాత్మక ఇన్నింగ్స్‌లు ఆడిన పుజారా స్థానాన్ని భర్తీ చేసే ఆటగాడెవరో చూడాలి మరి!

'రాజ్‌కోట్ నుంచి కుటుంబంతో కలిసివచ్చిన ఓ అబ్బాయి.. భారత క్రికెట్‌లోకి అడుగుపెట్టాలనే కలను నెరవేర్చుకున్నాడు. భారత జెర్సీని ధరించడం, జాతీయ గీతాన్ని ఆలపించడం, మైదానంలో జట్టుకోసం నా అత్యుత్తమ ప్రదర్శనను ఇచ్చేందుకు ప్రయత్నించడం.. ఇవన్నీ మాటల్లో చెప్పలేని అనుభూతులు. కానీ ఎంత మంచి విషయాలకైనా ఎప్పుడో ఒకప్పుడు ముగింపు చెప్పాల్సిందే. అన్ని ఫార్మాట్ల క్రికెట్ నుంచి రిటైర్ కావాలని నిర్ణయించుకున్నా. సౌరాష్ట్ర క్రికెట్ అసోసియేషన్, బీసీసీఐతో పాటు నేను ప్రాతినిధ్యం వహించిన అన్ని జట్లకు, నాకు మద్దతుగా నిలిచినవారందరికీ కృతజ్ఞతలు' -పుజారా

# ఆస్ట్రేలియాకు ఓదార్పు విజయం

## సిరీస్ సఫారీల సొంతం

మకాయ్ : దక్షిణాఫ్రికా పర్యటనను ఆస్ట్రేలియా విజయంతో ముగించింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి రెండు మ్యాచ్‌లను గెలుచుకుని సిరీస్ నెగ్గిన ఆతిథ్య సౌతాఫ్రికా మూడో మ్యాచ్‌లో దారుణంగా తడబడింది. మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆసీస్.. నిర్ణీత ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి 431 పరుగుల భారీ స్కోరు చేసింది. వన్డేలలో ఆ జట్టుకు ఇది రెండో (434 హయ్యస్ట్) అత్యుత్తమ స్కోరు. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (108 బంతుల్లో 142, 17 ఫోర్లు, 5 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (106 బంతుల్లో 100, 6 ఫోర్లు, 5 సిక్స్‌లు) శతకాలతో చెలరేగి తొలి వికెట్‌కు 250 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు.

అనంతరం కామెరూన్ గ్రీన్ (55 బంతుల్లో 118 నాటౌట్, 6 ఫోర్లు, 8 సిక్స్‌లు) సుడిగాలి ఇన్నింగ్స్ ఆడి శతకం బాదగా అలెక్స్ కేరీ (37 బంతుల్లో 50 నాటౌట్, 7 ఫోర్లు) సైతం ఓ చేయి వేయడంతో ఆసీస్ భారీ స్కోరు చేసింది. ఛేదనలో సఫారీలు 24.5 ఓవర్లలో 155 పరుగులకే కుప్పకూలి 276 పరుగుల భారీ తేడాతో పరాభవాన్ని మూటగట్టుకున్నారు. వన్డేలలో దక్షిణాఫ్రికాకు పరుగుల పరంగా ఇదే అతిపెద్ద (గతంలో భారత్‌పై 243 రన్స్ తేడాతో అపజయం) ఓటమి. ఆసీస్ ఆల్‌రౌండర్ కూపర్ కనోలి (5/22) ధాటికి సౌతాఫ్రికా బ్యాటింగ్ లైనప్ కుదేలైంది. డెవాల్డ్ బ్రెవిస్ (49) టాప్ స్కోరర్. మూడో వన్డే ఓడినా 2-1తో సిరీస్ సఫారీల వశమైంది.




# దాదా కొత్త ఇన్నింగ్స్..

## ప్రిటోరియా క్యాపిటల్స్ హెడ్‌కోచ్‌గా గంగూలీ

ఢిల్లీ: భారత క్రికెట్ జట్టు మాజీ సారథి సౌరవ్ గంగూలీ తన కెరీర్‌లో కొత్త ఇన్నింగ్స్ మొదలుపెట్టనున్నాడు. దక్షిణాఫ్రికాలో జరిగే 'ఎస్ఏ20' లీగ్‌లో ప్రిటోరియా క్యాపిటల్స్ జట్టుకు దాదా హెడ్‌కోచ్‌గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు ప్రిటోరియా క్యాపిటల్స్ ఆదివారం తమ సోషల్ మీడియా ఖాతాల వేదికగా ఈ విషయాన్ని వెల్లడించింది. 2026 సీజన్ నుంచి గంగూలీ తన బాధ్యతలను చేపట్టనున్నాడు. ప్రిటోరియా జట్టును ఢిల్లీ క్యాపిటల్స్ (జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్) నిర్వహిస్తున్న విషయం విదితమే.

క్యాపిటల్స్‌తో దాదాకు చాలాఏండ్లుగా మంచి అనుబంధముంది. బీసీసీఐ అధ్యక్షుడిగా బాధ్యతలను చేపట్టకముందు ఐపీఎల్‌లో ఢిల్లీ జట్టుకు అతడు 2018-19 సీజన్లకు టీమ్ డైరెక్టర్‌గా వ్యవహరించాడు. గతేడాది జేఎస్‌డబ్ల్యూ డైరెక్టర్ ఆఫ్ క్రికెట్‌గానూ బాధ్యతలు చేపట్టాడు. ఒక జట్టుకు పూర్తిస్థాయిలో హెడ్‌కోచ్‌గా పనిచేయనుండటం దాదాకు ఇదే మొదటిసారి. మరి బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ (క్యాబ్), బీసీసీఐని సమ-ర్థవంతంగా నడిపించిన దాదా.. హెడ్‌కోచ్‌గా ఎలాంటి ముద్ర వేస్తాడో చూడాలి.



# భారత్ 'ఏ' ఓటమి

బ్రిస్బేన్ : ఆస్ట్రేలియా మహిళల 'ఏ' జట్టుతో బ్రిస్బేన్ వేదికగా జరిగిన అనధికారిక టెస్టులో భారత 'ఏ' జట్టు ఓటమిపాలైంది. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ నిర్దేశించిన 281 పరుగుల లక్ష్యాన్ని ఆసీస్ 85.3 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి ఛేదించింది.

అనిక (72), డార్క్ (68), రాచెల్ (64) రాణించారు.



# దిగ్గజాల సరసన

## హాల్ ఆఫ్ ఫేమ్‌లో షరపోవా, బ్రయాన్ బ్రదర్స్

న్యూపోర్ట్ (యూఎస్): మాజీ టెన్నిస్ స్టార్ మరియా షరపోవా, డబుల్స్ లెజెండ్స్ బ్రయాన్ బ్రదర్స్‌కు టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో చోటుదక్కింది. ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో షరపోవాతోపాటు మైక్, బాబ్ బ్రయాన్‌ల పేర్లను దిగ్గజాల సరసన చేర్చారు. ఈ కార్యక్రమానికి అమెరికా టెన్నిస్ క్వీన్ సెరెనా విలియమ్స్ ప్రత్యేక అతిథిగా హాజరై అందరినీ ఆశ్చర్యపర్చింది. స్టేజ్ వెనుక నుంచి రంగప్రవేశం చేసిన సెరెనా.. 'మాజీ ప్రత్యర్థి, మాజీ అభిమాని.. చిరకాల స్నేహితురాలు' అంటూ షరపోవాను సభకు పరిచయం చేసింది. ప్రతిష్ఠాత్మక హాల్ ఆఫ్ ఫేమ్‌లో మరియా షరపోవాను చేర్చుతున్నట్టు ప్రకటించింది.



షెల్టన్, రదుకాను శుభారంభం: మాజీ చాంపియన్ ఎమ్మా రదుకాను, ఆరో సీడ్ బెన్ షెల్టన్ యూఎస్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రదుకాను 6-1, 6-2తో షిబహారాపై గెలుపొందింది. మరో మ్యాచ్‌లో వోంద్రుసోవా 6-3, 7-6 (3)తో సెలెఖమెటోవాని, 31వ సీడ్ ఫెర్నాండెజ్ 6-2, 6-1తో మరీనోను ఓడించి రెండో రౌండ్‌కు చేరారు. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో షెల్టన్ 6-3, 6-2, 6-4తో బుసెపై , 16వ సీడ్ మెన్సిక్ 7-6(5), 6-3, 6-4తో జారీపై, 18వ సీడ్ డవిడోవిచ్ 6-1, 6-1, 6-2తో షెవ్‌చెంకోపై నెగ్గారు.




# ఓజీ జస్ట్ 4 డేస్ అంతే..!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సుజిత్ కాంబినేషన్ లో వస్తున్న ఓజీ సినిమా సెప్టెంబర్ 27న రిలీజ్ ఫిక్స్ చేశారు. ఈ సినిమాను డివివి దానయ్య భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. పవన్ కళ్యాణ్ అభిమాని అయిన సుజిత్ ఆయన్ను తన ఫ్యాన్స్ ఎలా చూడాలని అనుకుంటున్నారో అలాంటి సినిమాగా ఓజీ చేస్తున్నారని తెలుస్తుంది. సినిమా మేకింగ్ పరంగా టాప్ క్లాస్ అనేలా ఉంటుందట. గ్యాంగ్ స్టర్ కథతో వస్తున్న ఓజీ సినిమా షూటింగ్ మరో 4 రోజులు మాత్రమే మిగిలి ఉందట. అది కూడా కొన్ని ప్యాచ్ వర్క్ మాత్రమే అని టాక్. సినిమాకు సంబందించిన 2 డేస్ కాకినాడలో షూటింగ్.. మరో రెండు రోజులు హైదరాబాద్ లో ప్యాచ్ వర్క్ చేస్తే గుమ్మడికాయ కొట్టేయడమే అని తెలుస్తుంది. సినిమా రిలీజ్ ఇంకా నెల్ రోజులు మాత్రమే ఉన్న ఈ టైం లో ప్రమోషన్స్ కూడా మొదలు పెట్టబోతున్నారు మేకర్స్. ఆగష్టు 27 వినాయక చవితి సందర్భంగా సినిమా నుంచి మరో సాంగ్ రిలీజ్ చేయబోతున్నారట. అది కూడా అదిరిపోతుందని అంటున్నారు. థమన్ మ్యూజిక్ అందిస్తున్న ఓజీ సినిమా మ్యూజిక్ పరంగా సంథింగ్ స్పెషల్ అనిపించేలా ఉంటుందట. సినిమా లో పవర్ స్టార్ స్టైలిష్ లుక్ ఫ్యాన్స్ కి పూనకాలు తెప్పిస్తుందని అంటున్నారు. ఇప్పటికే పవర్ స్టోర్మ్ సాంగ్ తో సినిమాపై హ్యూజ్ బజ్ పెంచాడు సుజిత్. ఇక నెక్స్ట్ సినిమాను ఫ్యాన్స్ అంచనాలకు మించి ఉండేలా చేస్తున్నాడట. ఓజీ సినిమా ప్రీ రిలీజ్ బిజినెస్ కూడా భారీగా జరుగుతుందని తెలుస్తుంది. ఓజీ సినిమా షూటింగ్ పూర్తైతే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కూడా త్వరగా పూర్తి చేసేలా సుజిత్ ప్లాన్ చేస్తున్నాడట. తప్పకుండా సుజిత్ ఈ సినిమాతో తాను ఎంత గొప్ప పవర్ స్టార్ ఫ్యాన్ అని ప్రూవ్ చేసుకోవాలని చూస్తున్నాడు. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నుంచి రీసెంట్ గా హరి హర వీరమల్లు సినిమా వచ్చింది. ఆ సినిమా తర్వాత వస్తున్న ఓజీపై అంచనాలైతే త్రాస్థాయిలో ఉన్నాయి. మరి ఈ అంచనాలను అనుకునేలా సినిమా ఉంటుందా లేదా అన్నది చూడాలి. ఈ సినిమాలో పవన్ కళ్యాణ్ కి జతగా ప్రియాంక అరుల్ మోహన్ నటిస్తుంది. తెలుగులో ఆమెకు ఇది నాలుగో సినిమా. సరిపోదా శనివారం తో హిట్ కొట్టిన అమ్మడు ఓజీ తో ఎలాంటి క్రేజ్ తెచ్చుకుంటుందో చూడాలి.

# బాలకృష్ణకు అంతర్జాతీయ గుర్తింపు

నటుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న నందమూరి బాలకృష్ణ లండన్‌కు చెందిన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

ప్రముఖ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన సినీ ప్రస్థానంలో ఒక అరుదైన మైలురాయిని చేరుకున్నారు. కథానాయకుడిగా 50 ఏళ్లు పూర్తి చేసుకున్న చారిత్రక ఘట్టానికి గుర్తుగా ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. లండన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్' తమ గోల్డ్ ఎడిషన్‌లో బాలకృష్ణకు స్థానం కల్పించింది. ఈ అపురూప విజయానికి గాను ఆయనకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ ఆయనకు శుభాభినందనలు తెలిపారు. "ప్రియమైన బాలయ్యకు అభినందనలు. కథానాయకుడిగా 50 ఏళ్ల ఆయన ప్రస్థానం భారత సినీ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తింపు ఆయన అసాధారణ ప్రయాణానికి నిదర్శనం" అని చంద్రబాబు పేర్కొన్నారు. తరతరాల ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న బాలకృష్ణ అంకితభావం, పట్టుదల ఎందరికో ఆదర్శమని ఆయన కొనియాడారు. నారా లోకేష్ కూడా స్పందిస్తూ, "ప్రియమైన బాల మావయ్యకు శుభాకాంక్షలు. ఆయన వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం మా కుటుంబానికే కాక, ప్రతి తెలుగు సినీ అభిమానికి గర్వకారణం. సినిమా పట్ల ఆయనకున్న అభిరుచి, క్రమశిక్షణ మా అందరికీ స్ఫూర్తినిస్తాయి," అని తెలిపారు. ఈ విధంగా కుటుంబ సభ్యుల నుంచి అభినందనలు వెల్లువెత్తడంతో నందమూరి అభిమానులు, తెలుగు సినీ పరిశ్రమ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.



# క్యూట్ హీరోయిన్ తెలుగులో ఎప్పుడు..?

మలయాళ స్టార్ డైరెక్టర్ ప్రియదర్శన్ కూతురు కళ్యాణి ప్రియదర్శన్ హీరోయిన్ గా తన టాలెంట్ చూపిస్తుంది. తనకు నచ్చిన పాత్రల్లో నటిస్తూ ప్రేక్షకులను మెప్పిస్తూ వస్తుంది అమ్మడు. ప్రస్తుతం ఆమె లోక సినిమాతో ఈ నెల చివరన వస్తుంది. ప్రేమలు హీరో నెస్లన్ తో కలిసి కళ్యాణి ప్రియదర్శన్ చేసిన ఈ లోక సినిమాను డామినిక్ అరుణ్ డైరెక్ట్ చేశారు. ఈ సినిమాను వేఫారర్ ఫిలిమ్స్ బ్యానర్ లో దుల్కర్ సల్మాన్ నిర్మించారు. ఆగష్టు 28న ఈ సినిమా మలయాళంలో రిలీజ్ అవుతుండగా ఈ సినిమాను అదే రోజు తెలుగులో కూడా రిలీజ్ చేస్తున్నారు. తెలుగులో కొత్త లోక టైటిల్ తో ఈ మూవీని రిలీజ్ చేస్తున్నారు. తెలుగులో ఈ మూవీని సితార బ్యానర్ రిలీజ్ చేస్తుంది. ఫిమేల్ సెంట్రిక్ సినిమాగా వస్తున్న కొత్త లోక మీద హీరోయిన్ కళ్యాణి ప్రియదర్శన్ చాలా కాన్ఫిడెంట్ గా ఉంది. మలయాళ సినిమాలు ఎప్పుడూ కొత్త కంటెంట్ తో సినిమాలు చేస్తారు. ఐతే ఈ కొత్త లోక కూడా కొత్త ప్రయత్నమే అని అంటుంది అమ్మడు. కొత్త లోకాతో మరోసారి తెలుగు ఆడియన్స్ ని పలకరిస్తుంది కళ్యాణి. అమ్మడు అంతకుముందు అఖిల్ తో హలో, సాయి ధరం తేజ్ తో చిత్రలహరి సినిమాలు చేసింది. ఆ తర్వాత ఎందుకో అమ్మడు తెలుగులో సినిమాలు చేయలేదు. ఆఫర్లు రాలేదా లేదా వచ్చినా కూడా కళ్యాణి చేయనని అన్నదా అని తెలియదు కానీ కళ్యాణి ప్రియదర్శన్ మాత్రం తెలుగులో అసలు కనిపించట్లేదు. కొత్త లోక సినిమా ప్రమోషన్స్ కి ఇక్కడికి వస్తే మాత్రం కచ్చితంగా తెలుగులో నటించే విషయంపై ఆమెని నెటిజెన్లు ప్రశ్నల వర్షం కురిపిస్తారని చెప్పొచ్చు. లోక ఇంటర్వ్యూలో తనకు ప్రణవ్ మోహన్ లాల్ బెస్ట్ ఫ్రెండ్ అని.. మా గురించి ఎవరేం అనుకున్నా కూడా మా ఇద్దరికి ఒకరంటే ఒకరం బాగా తెలుసు మాకు ఎలాంటి ఇబ్బంది లేదని అంటుంది కళ్యాణి.





# ఒక్క చుక్క కన్నీటి కోసం 28 టేకులు

బాలీవుడ్ లోని ఆర్టిస్టుల్లో పర్ఫెక్షనిస్ట్ గా పేరు తెచ్చుకున్న సీనియర్ నటి విద్యాబాలన్. ప్రతి సన్నివేశంలో ప్రతి చిన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని జాగ్రత్తగా నటిస్తుంది గనుకనే బాలన్ గొప్ప పెర్ఫామర్ గా వెలిగిపోతోంది. అయితే తనలోని ఈ పర్ఫెక్షన్ ఎలా వచ్చింది? అంటే అందుకు పునాది వేసింది తన దాదా అని చెబుతోంది. దాదాగా పిలుపందుకున్న దివంగత దర్శకుడు ప్రదీప్ సర్కార్ తమకు ఈ విషయాలన్నిటినీ కెరీర్ ఆరంభమే నేర్పించారని బాలన్ వెల్లడించింది. తామంతా ఆయన బాటలో నడుస్తామని తెలిపింది. 2005లో విడుదలైన పరిణీత చిత్రాన్ని రీమాస్టర్ చేసి తిరిగి 2025 ఆగస్టు 29న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా తన గురువు, -పరిణీత- దర్శకుడు ప్రదీప్ సర్కార్ గురించి బాలన్ గుర్తు చేసుకున్నారు. నా ప్రారంభ రోజుల్లో ప్రతిదానికి దాదా పునాది వేసారు. నా చిన్నతనంలోనే ప్రతిదీ ఆయన నుంచి నేర్చుకున్నాను. సీన్ తీసేప్పుడు ప్రతి డీటెయిల్‌పైనా ఆయనకున్న శ్రద్ధ అసమానమైనది. అతడు నటుల ప్రదర్శనల కోసం మాత్రమే కాదు.. సరైన సమయంలో పావురాలను ఎగురవేయడానికి .. సరైన సమయంలో కిటికీ వెలుపల ఆకులు పడేలా చేయడానికి కూడా వంద టేకులు తీసుకోగలడు. ప్రతిదానిలోనూ లయ ఉందని అతను నమ్ముతాడు! అని తెలిపింది విద్యా. ప్రతి సన్నివేశంలో కచ్ఛితత్వాన్ని కోరుకుంటాడని సర్కార్ ని ఆకాశానికెత్తేసారు. ఒకసారి నేను పాటలోని ఒక లైన్‌కు కన్నీటి చుక్కను సరైన టైమ్‌కి రాబట్టడానికి 28 టేకులు తీసుకున్నాను. అతడు కోరిన కచ్ఛితత్వం వచ్చేవరకూ ఎవరైనా ఆర్టిస్టు అలా చేయాల్సిందే. ఆయన మార్గదర్శకత్వం నాకు క్రాఫ్ట్‌లోని ప్రతి వివరం ఎలా గమనించాలో నేర్చుకున్నాను. 20 సంవత్సరాలుగా నాతో ఉన్న నా హెయిర్ స్టైలిస్ట్ శలక కూడా దాదా నుండి ప్రతిదీ నేర్చుకున్నాడు. అది మా అందరికీ ఆయన ఇచ్చిన బహుమతి అని బాలన్ చెప్పారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986